

క్రీడాకారుల గౌరవ వందనం స్వీకరిస్తూ..



టోర్నమెంట్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన టీషర్ట్‌ను ఆవిష్కరిస్తున్న దృశ్యం

రంగారెడ్డి | వికారాబాద్ | మేడ్చల్

వార్త



# యువతా.. మేలుకో!

## దారితప్పితే సమాజానికి నష్టం..శక్తిని సానుకూలత చేసుకోండి

### ఆరోగ్యకరమైన జీవనశైలితో చెడు అలవాట్లకు దూరం

### మాదకద్రవ్యాల వ్యతిరేక వారోత్సవాలలో కలెక్టర్, ఎస్పీ పిలుపు

### వికారాబాద్‌లో ఘనంగా క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం





వికారాబాద్ పట్టణంలో క్రికెట్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న కలెక్టర్ దీపక్ తివారీ, ఎస్పీ స్నేహ మెహ్రా

**వికారాబాద్, జూన్ 25, ప్రభాతవార్త:** యువతను మాదక ద్రవ్యాలకు దూరంగా ఉంచటమే లక్ష్యంగా జిల్లా పోలీస్ శాఖ వినూత్న కార్యక్రమాలను చేపడుతోంది. ఇందులో భాగంగా గురువారం వికారాబాద్ పట్టణంలో క్రికెట్ టోర్నమెంట్‌ను నిర్వహించారు. పోలీస్, ప్రెస్, డాక్టర్స్, అడ్వకేట్స్, రెవెన్యూ మున్సిపల్ కార్యాలయాలకు చెందిన టీమ్‌లు ఉత్సాహంగా పాల్గొన్నాయి. కలెక్టర్ దీపక్ తివారీ ముఖ్య అతిథిగా, జిల్లా ఎస్పీ స్నేహ మెహ్రా గౌరవ అతిథిగా హాజరై, క్రీడా జ్యోతిని వెలిగించి టోర్నమెంట్‌ను ప్రారంభించారు. అనంతరం టోర్నమెంట్ కోసం ప్రత్యేకంగా రూపొందించిన టీషర్ట్‌ను ఆవిష్కరించి, క్రీడాకారుల నుంచి గౌరవ వందనం స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, డ్రగ్స్ నిర్మూలన కోసం వినూత్నంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్న జిల్లా పోలీస్ శాఖను అభినందించారు. యువత మాదకద్రవ్యాలకు బానిసలైతే కుటుంబాలు, సమాజం తీవ్రంగా నష్టపోతాయని, అదే యువత తమ శక్తిని సానుకూల దిశలో వినియోగిస్తే సమాజాభివృద్ధికి ఎంతో తోడ్పడ తారని పేర్కొన్నారు. యువత క్రీడలు, విద్య సృజనాత్మక కార్యక్రమాల వైపు మళ్లాలని సూచిస్తూ, మన యువతను కాపాడటం అంటే దేశ భవిష్యత్తును రక్షించడమేనని స్పష్టం చేశారు. అలాగే, నేటి నుంచి ప్రారంభమైన ఎస్ఐఆర్ కార్యక్రమంలో ప్రజలందరూ చురుకుగా పాల్గొనాలని కోరారు. అనంతరం జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, డ్రగ్స్ వంటి సామాజిక సమస్యలను ఎదుర్కోవడానికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. క్రీడలు, ఫిట్‌నెస్ కార్యక్రమాలు ఆరోగ్యకరమైన జీవనశైలిని ప్రోత్సహించడం ద్వారా యువతను చెడు అలవాట్లకు దూరం చేయవచ్చని తెలిపారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణం ప్రతి పౌరుడి బాధ్యత అని, ఏ జట్టు గెలిచినా అది మనందరి విజయమని, ఆ విజయాన్ని డ్రగ్స్ రహిత సమాజ స్థాపనకు అంకితం చేస్తున్నట్లు ప్రకటించారు. ఈ కార్యక్రమంలో ట్రైనీ కలెక్టర్ సచిన్ బసవరాజ్ గుట్టూర్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయిస్తున్న సిపి తరుణ్ జోషి తదితరులు

# బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దు

**✦డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే జీవితం సాఫీ ✦ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషీ**

**శంషాబాద్, జూన్ 25, ప్రభాతవార్త :** మాదకద్రవ్యాలకు బానిసై యువత తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, డ్రగ్స్‌కు దూరంగా ఉంటేనే జీవితం సాఫీగా సాగుతుందని ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషీ పేర్కొన్నారు. శంషాబాద్ మండలం పరిధిలోని కాచారంలోని వర్ధమాన్ కళాశాలలో యువతలో మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే దుష్పరిణామాలపై శంషాబాద్ పోలీసులు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఫ్యూచర్ సిటీ కమిషనర్ తరుణ్ జోషీ హాజరై మాట్లాడారు. విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలని మత్తుకు బానిసలు కావొద్దన్నారు. మాదకద్రవ్యాల నిర్మూలన మనందరి బాధ్యతని, వీటి వినియోగం వలన వ్యక్తిగత జీవితం, కుటుంబం సమాజంపై తీవ్ర ప్రభావం చూపుతుందని వివరించారు. ఎన్‌డిపిఎస్ చట్టంలోని నిబంధనలు, డ్రగ్స్ కేసుల్లో శిక్షలు వాటి చట్టపరమైన పరిణామాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించారు. యువత చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ డ్రగ్స్‌కు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని సూచించారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని అధికారులు పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులు అధ్యాపకులతో కలిసి అధికారులు మాదకద్రవ్యాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో చేవెళ్ల జోన్ డీసీపీ యోగేష్ గౌతమ్, ఈగల్ ఫోర్స్ ఎస్పీ గిరిధర్, ఈగల్ ఫోర్స్ ఎస్పీ సీతారా, చేవెళ్ల ఎసిపి కిషన్, శంషాబాద్ పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ నరేందర్ రెడ్డి, ఎస్సైలు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.



హరిదాస్‌పల్లిలో ఇందిరమ్మ ఇంటి ప్రారంభోత్సవం అనంతరం లబ్ధిదారులకు వస్త్రాలు బహూకరిస్తున్న స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్

# వారి హయాంలో చేసింది.. అంతా అరాచకమే

- ♦డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేశారు
- ♦నియోజకవర్గంలో అందరికీ సొంత ఇళ్లు ఇవ్వడమే మా టార్గెట్
- ♦బిఆర్ఎస్‌పై స్పీకర్ ప్రసాద్ కుమార్ ధ్వజం

**ధారూర్, జూన్ 25, ప్రభాతవార్త:** గత ప్రభుత్వంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల పేరుతో మోసం చేశారని రాష్ట్ర శాసనసభాపతి, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ విమర్శించారు. తమది మాటల ప్రభుత్వం కాదని, చేతల్లో సంక్షేమాన్ని చూపిస్తున్నామని ఇందుకు ఇందిరమ్మ ఇళ్లే నిదర్శన మన్నారు. ధారూర్ మండలం హరిదాస్‌పల్లి గ్రామంలో లబ్ధిదారులు రుక్కుంపల్లి అనురాధప్రభాకర్ దంపతులు నిర్మించుకున్న నూతన ఇందిరమ్మ ఇంటిని ఆయన గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, దేశంలో పేదలకు సేవ చేయడంలో దివంగత ప్రధాని ఇందిరాగాంధీ అగ్రగామిగా నిలిచారని, కూడు, గుడ్డ, నీడ కల్పించడమే లక్ష్యంగా ఆమె పనిచేశారని గుర్తు చేశారు. అదేవిధంగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సిఎంగా ఉన్నప్పుడు దివంగత నేత వైయస్ రాజశేఖర్ రెడ్డి కూడా పెద్ద ఎత్తున ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేశారని తెలిపారు. పూరి గుడిసెల్లో, అద్దె ఇళ్లలో ఉంటూ ఎండకు, వానకు ఇబ్బంది పడుతున్న పేదలకు నీడ కల్పించాలనే సంకల్పంతో నేడు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఒక్కో ఇంటికి ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయంతో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తున్నారని చెప్పారు. వికారాబాద్ నియోజకవర్గంలో సొంత స్థలం ఉండి ఇళ్లు లేని పేదలందరికీ విడతల వారీగా ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేస్తానని, భవిష్యత్తులో నియోజకవర్గంలో అందరికీ సొంత ఇళ్లు ఉండాలన్నదే తన లక్ష్యమని ఆయన స్పష్టం చేశారు. లబ్ధిదారుల ఎంపికలో పారదర్శకత పాటిస్తున్నామని, ఇందిరమ్మ ఇంటి కమిటీల ద్వారా వడపోసి అర్హులైన పేదలకు మాత్రమే ఇళ్లు కేటాయిస్తున్నామని తెలిపారు. నిర్మాణానికి సంబంధించిన బిల్లులను ఎటువంటి ఆలస్యం లేకుండా నాలుగు విడతల్లో నేరుగా లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లోనే జమ చేస్తున్నామని, ఇందులో మధ్య వర్తులకు తావులేదని పేర్కొన్నారు.

# ప్రతి బస్సుకూ ఫిట్‌నెస్

**✦షెడ్డుకెళ్లిన ఆర్టీసీ బస్సులను తక్కువ రేటుకు తెచ్చి విద్యార్థుల కోసం వాడుతున్నారు ✦ఇక అలా కుదరదు ✦అభం శుభం తెలియని చిన్నారుల ప్రాణాలతో చెలగాటం ఆడకండి : ట్రాఫిక్ డిసిపి శివమ్**





ప్రైవేటు స్కూళ్ల బస్సులను తనిఖీ చేస్తున్న పోలీసు అధికారులు

**మొయినాబాద్ : జూన్ 25, ప్రభాతవార్త :** ఆర్టీసీలో ఫిట్‌నెస్ లేక పక్కనబెట్టిన బస్సులను తక్కువ రేటుకు కొనుగోలు చేసి పాఠశాల విద్యార్థుల కోసం వాడుతున్నారన్న సమాచారం ఉందని ట్రాఫిక్ డిప్యూటీ కమిషనర్ మండిపడ్డారు. కానీ గతం ఒక లెక్క ఇప్పుడు ఒక లెక్క అలాంటి బస్సులను వెంటనే తొలగించాలని ఆదేశించారు. అభం శుభం తెలియని విద్యార్థుల ప్రాణాలతో చెలగాటమాడద్దని కోరారు. గురువారం ఆయన పలు స్కూల్ బస్సులను తనిఖీ చేశారు. వాహనాలు నడిపేటప్పుడు మద్యం సేవిస్తే వారి లైసెన్సులను పూర్తిగా రద్దు చేస్తామన్నారు. స్కూల్ బస్సుల్లో హెల్పర్లు కేర్‌టేకర్‌లు అందుబాటులో ఉండాలన్నారు. రవాణా భద్రతా నిబంధనలను కచ్చితంగా పాటించాలని సుజాత పాఠశాల యాజమాన్యానికి సూచించారు. కార్యక్రమంలో ఏసీపీ ట్రాఫిక్ ఎఫ్‌సీసీ కె. చంద్రశేఖర్, చేవెళ్ల ట్రాఫిక్ పీఎస్ ఇన్‌స్పెక్టర్ బి. సతీష్, ట్రాఫిక్ సిబ్బంది, బస్సు డ్రైవర్లు, పాఠశాల యాజమాన్యం, విద్యార్థులు పాల్గొన్నారు.

# గతంలో చేసిన పొరపాట్లను సరిదిద్దుకుంటాం



మాట్లాడుతన్న కెటిఆర్



**★అధికారంలోకి రాగానే ప్రతి ఒక్కరికి రాజకీయంగా అవకాశం ★కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటాం ★పార్టీ సభ్యత్వాన్ని పగడ్బందీగా నిర్వహించాలి ★చేవెళ్లను అభివృద్ధి చేసింది మన ప్రభుత్వమే ★అది చూసి యాదయ్యను గెలిపించింది మీరే ★ఇప్పుడు ఓడించాల్సిందీ మీరే ★బిఆర్ఎస్ సమావేశంలో కెటిఆర్ దిశానిర్దేశం**

**చేవెళ్ల, జూన్ 25, ప్రభాతవార్త :** చేవెళ్ళ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసిన ఘనత బిఆర్ఎస్‌కే దక్కుతుందని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ పేర్కొన్నారు. బిఆర్ఎస్ హయంలో చేవెళ్ల ప్రాంతంలో అనేక పరిశ్రమలు తీసుకువచ్చామన్నారు. గురువారం చేవెళ్ల మున్సిపల్ పరిధిలోని పద్మావతి కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించిన చేవెళ్ల నియోజకవర్గ ఎస్ఐఆర్ శిక్షణ కార్యక్రమం, బిఆర్ఎస్ పార్టీ జనరల్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడారు. చందన్‌వెల్లి, సీతారాంపూర్‌లో పారిశ్రామిక పార్క్‌ను, మైక్రోసాఫ్ట్, అమెజాన్, వెల్స్‌వన్ వంటి కంపెనీలను తీసుకువచ్చి వేలాది మందికి ఉపాధిని కల్పించామన్నారు. "బిఆర్ఎస్ చేసిన అభివృద్ధి పనులను చూసి చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్యను గెలిపించింది మీరే.. మళ్లీ. ఓడగొట్టాల్సింది కూడా మీరే" అని పిలుపునిచ్చారు. పార్టీ సభ్యత్వం నమోదును పకడ్బందీగా చేయాలని దిశానిర్దేశం చేశారు. అధికారంలోకి రాగానే కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకునే భాద్యత తీసుకుంటామన్నారు. గతంలో చేసిన చిన్న చిన్న పొరపాట్లను సరిచేసుకుని ప్రతి ఒక్కరికి రాజకీయంగా అన్ని అవకాశాలు కల్పిస్తామన్నారు.

**బిఆర్ఎస్‌లో నాయకుల్లో జోష్**

చేవెళ్ల అసెంబ్లీ నియోజవర్గంలో ఏర్పాటు చేసిన బిఆర్ఎస్ పార్టీ సమావేశానికి వచ్చిన మాజీ మంత్రి కెటిఆర్‌కు బిఆర్ఎస్ నాయకులు ఘన స్వాగతం పలికారు. నియోజకవర్గంలోని ఐదు మండలాల నుంచి నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చారు. మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి అధ్వర్యంలో ఆయనను గజమాలతో సత్కరించారు. పెద్ద ఎత్తున బాణా సంచాలను కాల్చి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మాజీ మ్మెల్యే నరేందర్‌రెడ్డి, మాజీ జిల్లా అద్యక్షుడు నాగేందర్‌గౌడ్, జిల్లా మహిళ అద్యక్షురాలు స్వప్న, నియోజవర్గం ఇంచార్జి దేశెమొళ్ల అంజనేయులు, డిజిఎంఎస్ మాజీ చైర్మన్ క్రిష్ణారెడ్డి, మాజీ జడ్‌పిటిసి అవానాష్‌రెడ్డి, పార్టీ యువనాయకులు కార్తీక్‌రెడ్డి, కళ్యాణ్‌రెడ్డి, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే అనంద్, మండల పార్టీ అధ్యక్షుడు ప్రభాకర్, మాజీ ఎంపిపి విజయభాస్కర్‌రెడ్డి, నాయకులు శేఖర్‌రెడ్డి, నత్తి క్రిష్ణారెడ్డి, కనకమామిడి మల్లారెడ్డి, దండు సత్యనారాయణ, తలారి యాదయ్య, పెంజర్ల అనంత్‌రెడ్డి, కరుణాకర్‌రెడ్డి, దూత మల్లేష్, చందు, శ్రీనివాస్‌రెడ్డి, మల్లేష్, మహిళ నాయకురాల్లు తలారి శ్వేత, నత్తి లావణ్య, వనం మహేందర్‌రెడ్డి, మాదవరెడ్డి, గోనే కరుణాకర్‌రెడ్డి, హన్మంత్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు. కెటిఆర్ రాకతో నాయకులకు నూతనోత్సహం కలిగింది.

**మొయినాబాద్‌లో ఘన స్వాగతం..**

**మొయినాబాద్:** కేటీఆర్‌కు మార్గమధ్యలోని మొయినాబాద్ వద్ద పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. అనంతరం గజమాలతో సత్కరించి. అక్కడి నుండి చేవెళ్ల వరకూ ర్యాలీగా కెటిఆర్ కాన్వాయ్‌తో కలిసి వెళ్లారు.

# అభివృద్ధి చేయటం చేతకాక యార్డు నిధులు తరలించేశారు

**●పట్టించుకోని నాటి పాలకులను ఏమనాలి? ●నేడు మార్కెట్ కోసం రూ. 3.12 కోట్లతో మూడు షెడ్లు నిర్మిస్తున్నాం ●షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్**



వ్యవసాయ మార్కెట్ యార్డులో షెడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే

**షాద్‌నగర్, జూన్ 25, ప్రభాతవార్త :** షాద్ నగర్ నియోజకవర్గంలో రైతుల సంక్షేమం, వ్యవసాయ అభివృద్ధి తమ ముఖ్య లక్ష్యమని షాద్‌నగర్ ఎమ్మెల్యే రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ వీర్లపల్లి శంకర్ అన్నారు. రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ ప్రభుత్వ వ్యవసాయ మార్కెట్ యార్డులో రూ. 3.12 కోట్లతో మూడు రైతు ప్రయోజన షెడ్లను నిర్మించేందుకు శంకుస్థాపన చేశారు. మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ మొహమ్మద్ అలీ ఖాన్ బాబర్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమానికి మార్కెట్ కమిటీ డైరెక్టర్లు అందరూ హాజరయ్యారు. అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఆయా మండలాల అధ్యక్షులు సీనియర్ నాయకులు రైతులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. శంకుస్థాపన పూజాది కార్యక్రమాల అనంతరం ఎమ్మెల్యే శంకర్ మీడియాతో మాట్లాడారు. మూడు కోట్ల 12 లక్షల రూపాయలతో మూడు షెడ్లను ప్రజల ప్రయోజనార్థం ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. గత పాలకులు ఇంత పెద్ద మార్కెట్ యార్డును అభివృద్ధి చేయకుండా నిరక్ష్యం చేశారని పైగా కోట్లాది రూపాయలను ఈ మార్కెట్ నుండి సిద్దిపేటకు తరలించారని ఆందోళన వ్యక్తం చేశారు. మార్కెట్ యార్డును అభివృద్ధి చేయలేని చేతకాని దద్దమ్మలు ఈ పని చేశారని అసెంబ్లీలో ఈ విషయంపై ప్రస్తావిస్తే మళ్లీ తిరిగి ఇవ్వకుండా జీవో ప్రకారం తీసుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ ప్రాంత నిధులను ఇతర ప్రాంతానికి తరలిస్తుంటే పట్టించుకోని పాలకులను ఏమనాలని ఎమ్మెల్యే ప్రశ్నించారు. ఇటీవల మార్కెట్ యార్డులో రాజకీయ ప్రయోజనాల కోసం కట్టుకథలు కల్పించి ప్రచారం చేసుకున్నారని అన్నారు. పంట ధరను నిర్ణయించేది కేంద్ర ప్రభుత్వం అని కొనుగోలు చేసేది కేంద్ర ప్రభుత్వం అని కేవలం రాష్ట్ర ప్రభుత్వం నిర్వహణ చేస్తుందని ఈ మాత్రం ఇంకిత జ్ఞానం లేకుండా ప్రభుత్వంపై విమర్శలు చేయడం సిగ్గుచేటు అన్నారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆధ్వర్యంలో రైతు ప్రయోజన కార్యక్రమాలను చేపట్టడం జరుగుతుందని కమిటీ చైర్‌పర్సన్ సులోచన కృష్ణారెడ్డి స్పష్టం చేశారు. కార్యక్రమం సందర్భంగా వారు మాట్లాడుతూ.. మూడు కోట్ల 12 లక్షలతో మూడు షెడ్లను మూడు నెలల కాలంలో నిర్మించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా మరో 32 లక్షలతో సిసి రోడ్లు కూడా త్వరలో ఏర్పాటు చేయబోతున్నట్లు తెలిపారు. వ్యవసాయ మార్కెట్ యార్డులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి స్థాయిలో చర్యలు చేపడతామని వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ సెక్రటరీ వెంకట్ రెడ్డి, డిఈఈ విష్ణువర్ధన్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ అగ్గనూర్ బసవేశ్వర్, వైస్ చైర్మన్ అందే మోహన్ ముదిరాజ్,మార్కెట్ కమిటీ చైర్మన్ సులోచన కృష్ణ రెడ్డి వైస్ చైర్మన్ బాబార్ అలీ ఖాన్, 5వార్డు కౌన్సిలర్ శిరీష అనిల్ కుమార్, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కరుణాకర్, భరత్ లోహోటీ ,నవీన్, రవి నాయక్, బాలశివరెడ్డి, పి నర్సింలు, వెంకట నరసింహారెడ్డి, వెంకట్ రెడ్డి, కక్కునూరు సందీప్, సురేష్ గౌడ్,కమిషన్ ఏజెంట్లు ప్రకాష్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.





మాట్లాడుతున్న జిల్లా స్పెషల్ ఆఫీసర్ వికాస్‌రాజ్

# వర్షాకాలం సమస్యలను ముందుగానే గుర్తించండి

**ప్రగతి ప్రణాళిక ప్రత్యేక అధికారి వికాస్‌రాజ్**

**మేడ్చల్ జిల్లా ప్రతినిధి, జూన్ 25, ప్రభాతవార్త :** ఈ వర్షాకాలంలో నీరు నిలువ ఉండే ప్రాంతాలను ముందుగానే గుర్తించాలని మేడ్చల్ జిల్లా ప్రజాపాలన-ప్రగతి ప్రణాళిక ప్రత్యేక అధికారి వికాస్‌రాజ్ (ఐఏఎస్) ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. వివిధ శాఖల్లో గుర్తించిన సమస్యలను ప్రాధాన్యత క్రమంలో పరిష్కరించాలని సూచించారు. అభివృద్ధి, సంక్షేమ పథకాల అమలు నిరంతర ప్రక్రియ అని, ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక స్ఫూర్తిని భవిషత్‌లోనూ కొనసాగించాలని సూచించారు. సంక్షేమ పథకాలను అర్హులందరికి అమలు చేయటంతో పాటు ప్రజల సమస్యలను గుర్తించటానికి ప్రజాపాలన-ప్రగతి ప్రణాళికను ప్రభుత్వం చేపట్టి అమలు చేసిందన్నారు. వార్డుల సభల నిర్వాహణతో కింది స్థాయి నుంచి ప్రజల సమస్యలను గుర్తించటంతో పాటు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, చేపట్టిన అభివృద్ధి పనులు గురించి అధికారులు ప్రజలకు వివరించటం అభినందనీయమన్నారు. ప్రభుత్వం రూపొందించిన 10థీములతో కూడిన ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ మనుచౌదరి, డిసిపి కోటిరెడ్డిలతోదీనిలో జిల్లా అదనపు కలెక్టర్లు ఫైజాన్ అహ్మద్, విజయేందర్‌రెడ్డి,డిఆర్ఓ మాలతి, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి..

**మొయినాబాద్, జూన్ 25, ప్రభాతవార్త :** రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందాడు ఈ ఘటన మొయినాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. మొయినాబాద్ మున్సిపల్ పరిధిలోని ఎన్కేపల్లి గ్రామానికి చెందిన దప్పు కరంచంద్ తండ్రి దప్పు యాదయ్య వయస్సు (38) ఈనెల 19న శుక్రవారం రాత్రి సుమారు 11:30 గంటల సమయంలో తన పల్సర్ బైక్ పైన హిమాయత్ నగర్ నుండి ఎన్కేపల్లి గ్రామానికి వెళ్తున్నాడు. మార్గమధ్యలోని మజీదు వద్దకు చేరుకోగా.. అదే సమయంలో తనకు ఎదురుగా కుక్క అడ్డు వచ్చింది. దీంతో కుక్కను తప్పించబోయి తన బైక్ పొదుపుతప్పి రోడ్డుపై పడ్డాడు. అతనికి తలకు మరియు ముఖానికి బలమైన గాయాలయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం నగరంలోని నిమ్స్ ఆసుపత్రికి తరలించారు. గత వారం రోజుల నుండి ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం ఉదయం సుమారు నాలుగు గంటల సమయంలో మృతి చెందాడని డ్యూటీ డాక్టర్ తెలిపారు. ఈ మేరకు మృతుడి సోదరుడు దప్పు ఆనంద్ ఫిర్యాదు మేరకు మొయినాబాద్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## ఓటర్ల జాబితా ప్రక్రియను సజావుగా నిర్వహించాలి



ఎదులాబాద్‌లో ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీని పరిశీలిస్తున్న జిల్లా కలెక్టర్ మనుచౌదరి

**ఘట్‌కేసర్, జూన్ 25, ప్రభాతవార్త:** ఓటర్ల జాబితా సవరణలో భాగంగా చేపట్టిన స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) ప్రక్రియను సక్రమంగా నిర్వహించాలని మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా కలెక్టర్ మనుచౌదరి అన్నారు. ఎంఎంసి ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్‌లో గురువారం జిల్లా కలెక్టర్ బిఎల్ఓలు ఇంటింటికి అందిస్తున్న ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈసందర్భంగా బిఎల్ఓలను ప్రశ్నించి పలు విషయాలపై అడిగి తెలుసుకున్నారు. ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ, ఎన్‌రోల్‌మెంట్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేసే ప్రక్రియ, క్యూఆర్‌కోడ్ అప్‌లోడ్ ప్రక్రియలను ఆయన తెలుసుకున్నారు. ఇంటింటికి అందిస్తున్న పత్రాలను పూర్తి చేయడానికి ప్రజల సందేహాలను నివృతి చేయాలని ఆయన సూచించారు. కలెక్టర్ వెంట ఘట్‌కేసర్ నాయబ్ తహశీల్దార్ చంద్రశేఖర్, గిర్దావర్లు కావ్య, సాయిరాం, సూపర్‌వైజర్–జిపిఓ మాధవరెడ్డి, విఆర్ఏ సుధాకర్, వెంకటేశ్, బిఎల్ఓలు పాల్గొన్నారు.

## రెడ్డికాలనీలో అండర్ డ్రైనేజ్ నిర్మాణ పనులు షురూ..

**హర్షం వ్యక్తం చేస్తున్న కాలనీ ప్రజలు**



అండర్ డ్రైనేజ్ నిర్మాణ పనులు జరుగుతున్న దృశ్యం.

**నందిగామ, జూన్ 25, ప్రభాతవార్త :** నందిగామ మండలం సిడిత్వాడ గ్రామ పంచాయతీ పరిధిలోని రెడ్డికాలనీలో అండర్ డ్రైనేజ్ నిర్మాణ పనులను సర్పంచ్ గబ్రు చౌహాన్, ఉప సర్పంచ్ రవీందర్ నాయక్ లు గురువారం ప్రారంభించారు. ఎన్నో ఏళ్ల నాటి కళ ..ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రత్యేక సహకారంతో ఫలించబోతున్నందుకు ధన్యవాదాలు తెలుపుతూ పనులకు శ్రీకారం చుట్టిన సిడితాండ సర్పంచ్ మూడావత్ గబ్రుచౌహాన్ కు,పంచాయతీ పాలకవర్గానికి కాలనీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.




మాట్లాడుతున్న డిప్యూటీ డిఎంహెచ్వో డాక్టర్ విజయలక్ష్మి

## ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు తప్పనిసరి

**షాద్‌నగర్, జూన్ 25, ప్రభాతవార్త :** జూన్ 28న నిర్వహించనున్న జాతీయ టీకాకరణ దినోత్సవం (పల్స్ పోలియో) కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్ఓ డాక్టర్ విజయలక్ష్మి మ్మ సూచించారు. గురువారం ఎంపీడీవో కార్యాలయంలో పల్స్ పోలియో కార్యక్రమంపై సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో మాట్లాడిన డాక్టర్ విజయలక్ష్మి మ్మ, 0 నుంచి 5 సంవత్సరాల లోపు ప్రతి చిన్నారికి తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని అన్నారు. భారతదేశం పోలియో రహిత దేశంగా గుర్తింపు పొందినప్పటికీ, భవిష్యత్తులో వైరస్ పునరాగమనం జరగకుండా అప్రమత్తంగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. షాద్‌నగర్ డివిజన్ పరిధిలో సుమారు 36 వేల మంది చిన్నారులకు పోలియో చుక్కలు అందించేందుకు ప్రత్యేక బూత్‌లు, ట్రాన్సిట్ పాయింట్లు, మొబైల్ బృందాలు, పర్యవేక్షణ బృందాలను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. బస్ స్టేషన్లు, రైల్వే స్టేషన్లు తదితర రద్దీ ప్రాంతాల్లో కూడా ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. తల్లిదండ్రులు తమ పిల్లలను సమీప పోలియో బూత్‌లకు తీసుకువచ్చి పోలియో చుక్కలు వేయించాలని, ఇప్పటికే సాధారణ టీకాలు తీసుకున్న చిన్నారులకు కూడా పల్స్ పోలియో చుక్కలు తప్పనిసరిగా వేయించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఒక్క చిన్నారి కూడా మిస్ కాకుండా చూడటం ప్రతి ఒక్కరి బాధ్యత అని ఆమె అన్నారు.ఈ సమావేశంలో ఎంపీడీవో శ్రీకాంత్, ఎంఈఓ మనోహర్, గ్రామ కార్యదర్శులు, ఐసీడీఎస్ సిబ్బంది, చించోడ్ వైద్యాధికారి డాక్టర్ శ్రావంతి, హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

## నితిన్ నబిన్ పర్యటనను విజయవంతం చేయాలి

**అత్తాపూర్, జూన్ 25,ప్రభాతవార్త :**
కేంద్ర సహాయ మంత్రి నితిన్ నబిన్ పర్యటనను విజయవంతం చేయాలని పలవురు బిజెపి ముఖ్యనేతలు పేర్కొన్నారు. బిజెపి జాతీయ అధ్యక్షుడు నితిన్ నబిన్ పర్యటనకు సంబంధించిన కార్యక్రమంపై మైలార్ దేవ్‌పల్లి డివిజన్ ప్రెసిడెంట్ సూరెడ్డి వినయ్ రెడ్డి ఆధ్వర్యంలో కాటేదాన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమానికి అతిథిగా రంగారెడ్డి జిల్లా ఐటీ కన్వీనర్ వెంకట్ రామన గుప్త హాజరై ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ...ఈ నెల 28న శంషాబాద్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన జిల్లా కార్యాలయం ప్రారంభోత్సవానికి పార్టీ కార్యకర్తలు, బూత్ అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, బీఎల్ఏ2లు మరియు సీనియర్ నాయకులు అధిక సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని ఘన విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో పార్టీ నాయకులు, జోగు రవి , అడికే రాజు, బల్ల శ్రీనివాస్ యాదవ్, జి శ్రవణ్ కుమార్, జి అంజి , కొండల, రామ్ కృష్ణ , రాజేష్ కుమార్, అరుణ్ కుమార్, రాజ్కుమార్, సాయి కుమార్ తదితరులు పాల్గొన్నారు.



# ఘట్‌కేసర్‌లో ఎస్ఐఆర్‌పై డిసి వాణి పర్యవేక్షణ



ఘట్‌కేసర్‌లో ఎన్నికల సామాగ్రిని పంపిణీని పర్యవేక్షిస్తున్న డీసీ వాణిరెడ్డి

**ఘట్‌కేసర్, జూన్ 25, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్‌లో గురువారం డిప్యూటీ కమీషనర్ అల్లూరి వాణిరెడ్డి ఎస్ఐఆర్ ప్రక్రియను పర్యవేక్షించారు. స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ కార్యక్రమంలో భాగంగా డీసీ వాణి ఘట్‌కేసర్ వార్డులో క్షేత్రస్థాయిలో సమగ్ర తనిఖీలు నిర్వహించారు. సహాయ మున్సిపల్ కమిషనర్, పర్యవేక్షణ అధికారులు, బూత్ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ఏజెంట్లతో ఓటర్ల జాబితాను సమీక్షించారు. డ్వాక్రాభవనంలో అధికారిక ఎన్నికల సామాగ్రి పంపిణీని ఆమె పర్యవేక్షించారు. ఇంటింటికి అందించే ఎన్యూమరేటర్ పత్రాలను సజావుగా సేకరించాలని సూచించారు. ఓటర్ల జాబితా ఖచ్చితత్వాన్ని నిర్ధారించడానికి ఇంటింటికి ధృవీకరణ డ్రైవ్‌ల సమయంలో స్థానిక నివాసితులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈకార్యక్రమంలో ఏఎంసీలు వెంకటేశం, వేణుగోపాల్‌రెడ్డి, బిఎల్ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

# వాతావరణమార్పు, జీవఎరువులతో సుస్థిర వ్యవసాయం

**ఘట్‌కేసర్, జూన్ 25, ప్రభాతవార్త:** ఘట్‌కేసర్ సర్కిల్ ఎదులాబాద్ డివిజన్ అవుషాపూర్‌లోని అనురాగ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు జాతీయ అధ్యాపకుల అభివృద్ధి కార్యక్రమం (ఎఫ్‌డిపి) నిర్వహించారు. వాతావరణమార్పు, జీవ ఎరువులు, జీవ పురుగుల మందుల ద్వారా సుస్థిర వ్యవసాయంపై ఈఎఫ్‌డిపి విజయవంతం జరిగింది. వాతావరణ మార్పుల సవాళ్లను ఎదుర్కొంటూ స్థిరమైన వ్యవసాయాన్ని ప్రోత్సహించేందుకు జీవ ఎరువులు, పురుగుల మందుల పాత్రపై ఈనెల 22 నుంచి 25 వరకు ఆన్‌లైన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో దేశవ్యాప్తంగా శాస్త్రవేత్తలు, అధ్యాపకులు, పరిశోధకులు, పరిశ్రమ నిపుణులు, విద్యార్థులు పాల్గొన్నారు. ఐసీఏఆర్–ఐఏఆర్ఐ, ఐసీఏఆర్–ఐఐఓఆర్, ఐసీఏఆర్–సీఏసీఆర్, ఉస్మానియా విశ్వవిద్యాలయం, ఢిల్లీ విశ్వవిద్యాలయం, ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, చరుసాట్ విశ్వవిద్యాలయం, శ్రీబయో ఎస్థెటిక్స్ ప్రైవేట్ లిమిటెడ్ తదితర సంస్థలకు చెందిన ప్రముఖ శాస్త్రవేత్తలు డాక్టర్ మీనాక్షి గ్రోవర్, డాక్టర్ సుసీలేంద్ర దేశాయ్, డాక్టర్ ఆర్‌డి.ప్రసాద్, డాక్టర్ వైజి.ప్రసాద్, డాక్టర్ జీషాన్‌ఉర్ రహ్మాన్, డాక్టర్ హమీదా బీ, డాక్టర్ కెఆర్‌కె.రెడ్డి, డాక్టర్ హితార్థ బట్, డాక్టర్ ఎన్.త్రిమూర్తులు, డాక్టర్ పి.కిషోర్‌వర్మ, డాక్టర్ శ్రేయ్‌బోధన్‌కర్, డాక్టర్ ఎ.మౌనిక ఉపన్యాసాలు అందించారు. వాతావరణ మార్పులకు అనుగుణంగా వ్యవసాయంలో సూక్ష్మజీవుల పాత్ర, హోలోబయోంట్, మైక్రో బయోమ్ ఆధారిత విధానాలు, ఎక్స్‌ట్రీమోఫైల్స్ ఆధారిత తదుపరి తరం జీవ ఎరువులు, ఎండోఫైట్స్ ద్వారా వాతావరణ మార్పుల ప్రభావాల నివారణ, జీవ ఇన్‌పుట్స్ వినియోగం, జీవ ఎరువులు–జీవ పురుగుమందుల వాణిజ్య ఉత్పత్తి, నాణ్యత నియంత్రణ, స్థిరమైన పంట ఉత్పత్తి, వాతావరణ మార్పులు జీవ పురుగుల మందుల సామర్థ్యంపై చూపే ప్రభావం వంటి



అవుషాపూర్ ఏయూలో ఎఫ్‌డిఎ కార్యక్రమంలో పాల్గొన్న శాస్త్రవేత్తలు, పరిశోధకులు, అధ్యాపకులు

సమకాలీన అంశాలపై నిపుణులు విశ్లేషణాత్మకంగా ఉపన్యాసాలు చేశారు. ఎఫ్‌డిపికి ప్లాంట్ పాథాలజీ విభాగం అసోసియేట్ ప్రొఫెసర్ డాక్టర్ శ్రేయ్ బోధన్‌కర్ కన్వీనర్‌గా, ప్లాంట్ ఫిజియాలజీ విభాగం సహాయ ప్రొఫెసర్ డాక్టర్ కె.స్టీఫెన్ కో–కన్వీనర్‌గా వ్యవహరించారు. అగ్రానమీ, ప్లాంట్ పాథాలజీ, ఎంటమాలజీ, సాయిల్‌సైన్స్, ప్లాంట్ ఫిజియాలజీ, జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, లైవ్ స్టాక్ విభాగం, బయోకెమిస్ట్రీ, ఆంగ్లము, ఇంజనీరింగ్ తదితర విభాగాలకు చెందిన అధ్యాపకులు, విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈకార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు గాను విశ్వవిద్యాలయం యాజమాన్యం, స్కూల్ ఆఫ్ అగ్రికల్చరల్ సైన్సెస్ డీన్ డాక్టర్ పి.నారాయణరెడ్డి అధ్యాపకులు, విద్యార్థులను పాల్గొన్న వారు అభినందించారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి విశేష స్పందన లభించిన ఈజాతీయ ఎఫ్‌డీపీ, స్థిరమైన వ్యవసాయ రంగంలో జ్ఞానమార్పిడి, శాస్త్రీయ చర్చలు, పరస్పర సహకారానికి వేదికగా నిలిచిందని నారాయణరెడ్డి పేర్కొన్నారు.

## ఎస్ఐఆర్ విజయవంతానికి కాంగ్రెస్ ఇన్‌చార్జిల నియామకం

**షాద్‌నగర్, జూన్ 25, ప్రభాతవార్త :** ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై నిర్వహించిన సమీక్ష సమావేశంలో షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ పాల్గొన్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా ఎస్ఐఆర్ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు మండలాల వారీగా కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జీలను నియమిస్తూ నూతన కమిటీని ప్రకటించారు.సమగ్ర ఓటరు జాబితా రూపకల్పనలో భాగంగా భారత ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమం తెలంగాణ రాష్ట్రంలో ప్రారంభమైన నేపథ్యంలో, షాద్‌నగర్ నియోజకవర్గంలోని ప్రతి అర్హత కలిగిన ఓటరికి ఈ ప్రక్రియపై పూర్తి అవగాహన కల్పించి, అవసరమైన సహకారం అందించాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. ఎస్ఐఆర్ కార్యక్రమం కాంగ్రెస్ పార్టీకి అత్యంత ప్రాధాన్యత కలిగిన అంశమని పేర్కొన్న ఆయన, మండల పార్టీ అధ్యక్షులు, ముఖ్య నాయకులు, ప్రజాప్రతినిధులు, నియోజకవర్గ ఇన్‌చార్జీలు మరింత బాధ్యతతో వ్యవహరించాలని ఆదేశించారు. కొందరు నాయకులు ఈ విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని అభిప్రాయం వ్యక్తం చేసిన ఎమ్మెల్యే, కార్యక్రమం పూర్తయ్యే వరకు ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై అవగాహన కల్పించే కార్యక్రమాల నిర్వహణలో కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్ష పార్టీలైన బీజేపీ, బీఆర్ఎస్ కంటే మెరుగ్గా పనిచేసిందని ఆయన పేర్కొన్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థకు ఓటరు జాబితా అత్యంత కీలకమని, అర్హులైన ప్రతి ఒక్కరి పేరు జాబితాలో ఉండేలా కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని మండలాలు, పట్టణాల వారీగా ఎస్ఐఆర్ కార్యక్రమ పర్యవేక్షణ కోసం క్రింది ఇన్‌చార్జీలను నియమించారు. నూతన ఎస్ఐఆర్ ఇన్‌చార్జీల కమిటీ ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ ఐ ఆర్) కోసం షాద్ నగర్



మాట్లాడుతున్న ఎమ్మెల్యే శంకర్

నియోజకవర్గంలోని ఆరు మండలాలకు రెండు మున్సిపాలిటీలకు కమిటీలను స్థానిక ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ప్రకటించారు. కొత్తూరు మండలానికి వీరేశం, చెంది తిరుపతిరెడ్డి, చిట్టెం దామోదర్ రెడ్డి, నందిగామ మండలం కోసం శ్రీను నాయక్, కృష్ణారెడ్డి, కేశంపేట మండలానికి ఇబ్రహీం, శ్రీకాంత్ రెడ్డి, ఫరూక్ నగర్ మండలం జితేందర్ రెడ్డి, కరుణాకర్, జంగ నరసింహులు, కొందుర్గు మండలానికి మహమ్మద్ అలీ ఖాన్ బాబర్, చలివేంద్రం పల్లి రాజు, జిల్లెడ చౌదరి గూడెం మండలానికి చాలా మాజీ జెడ్పిటిసి తండ్ర విశాలా శ్రావణ్ రెడ్డి, మాజీ ఎంపిపి శివ శంకర్ గౌడ్, షాద్ నగర్ మున్సిపాలిటీకి సిద్ధార్థ, శివారెడ్డి, విశాల శ్రవణ్ రెడ్డి, సురేష్ రెడ్డి, శ్రీధర్ రెడ్డి, శివ, భాస్కర్, అన్వర్, అంబటి ప్రభాకర్, జంగారి రవి, కొత్తూరు మున్సిపాలిటీకి వెంకటరామిరెడ్డి, నర్సప్పగూడ కృష్ణ, శివశంకర్ గౌడ్, కంసాన్పల్లి తుపాకుల శేఖర్ తదితరులను నియమించారు. నియమితులైన ఇన్‌చార్జీలు ఎస్ఐఆర్ ప్రక్రియలో ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు అర్హులైన ప్రతి ఓటరు వివరాలు ఓటరు జాబితాలో నమోదు అయ్యేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సూచించారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పనిచేసి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు.

# ఇందిరమ్మ ఇళ్ల పేరిట నకిలీ పత్రాలు సృష్టికర్తల అరెస్టు




మీడియా సమావేశంలో డిసిపి శ్రీధర్

**అల్వాల్, జూన్ 25 ప్రభాతవార్త:** ఇందిరమ్మ ఇళ్ళ మంజూరికి సంబంధించి నకిలీ పత్రాలు సృష్టించి పేదలు నుంచి లక్షలు రూపాయలు దండుకున్న ముఠాను అల్వాల్ పోలీసులు కటకా లు వెనుకకు నెట్టారు. కేసుకు సంబంధించి మల్కాజిగిరి డిసిపి శ్రీధర్ మీడియాకు వివరించారు. తిరిమలగిరి ప్రాంతానికి చెందిన జయ్‌రాజ్ ప్రభుత్వ కార్యాలయాలకు చెందిన పనులు చేయడంలో దిట్టగా ఉన్నాడు. బ్రోకర్‌గా పరిచయస్తులు ద్వారా ప్రభుత్వ పనులు చేస్తూ వారి నమ్మకాన్ని కూడగట్టుకున్నాడు. కలెక్టరేట్ కార్యాలయంలో అవుట్ సోర్సింగ్ ఉద్యోగిగా పని చేసిన పుష్పలత ఇతను జత కలిశారు. అల్వాల్‌లో రెండు పడక గదులు ఇల్లు ఇప్పిస్తామని ప్రజలను నమ్మిస్తూ వచ్చారు. పలు దఫాలుగా 50 వేలు నుంచి లక్ష రూపాయలు వరకు వసూలు చేశారు. 2023 నుంచి ఈ వ్యవహారాన్ని వీరు నడి పారు. డబ్బులు ఇచ్చి నెలలు గడుస్తున్నా ఇల్లు రాక పోవడం తో బాధితులు వీరిపై ఒత్తిడి తెచ్చారు. నకిలీ పత్రాలను సృష్టించాలని ఇరువురు నిర్ణయించుకున్నారు. రెండు గదులు ఇళ్ళు మంజూరుకు సంబంధించిన 79 నకిలీ పత్రాలను పేదలకు అందచేశారు. సొంతింటి కల నెరవేరిందనే గంపడా శతో వారు ఉన్నారు. మంజూరు పత్రాలు అయితే ఉన్నాయి కాని ప్రభుత్వ సిబ్బంది నుంచి ఎటువంటి సమాచారం వీరికి అందక పోవడంతో అనుమానం వచ్చింది. కలెక్టరేట్ ఇతర కార్యాలయాలకు తమకు ఇచ్చిన నకిలీ పత్రాలను తీసుకుని విచారణ జరపగా మోస పోయామని గుర్తించారు. బాధితులు అల్వాల్ పోలీసులకు ఫిర్యాదు చేయగా మొత్తం బండారం బయట పడింది. 99 మంది నుంచి వీరు డబ్బులు వసూలు చేసినట్లు విచారణలో తేలింది. నకిలీ సర్టిఫికేట్లును రాధా స్వా మి జిరాక్స్ సెంటర్ యజమాని మహేందర్ సింగ్ సృష్టించగా రబ్బర్ స్టాంపులను రాణిగంజ్‌లోని రాజ్ అండ్ కో వద్ద చే యించారు. నిందితులకు సహకరించిన మరో నలుగురు పరా రీలో ఉన్నారు. పుష్పలత, గోపీనాథ్, మహేందర్ సింగ్‌లను అదుపులోకి తీసుకుని విచారణ అనంతరం రిమాండ్‌కు తర లించనట్లు డిసిపి తెలిపారు. ప్రభుత్వ పథకాలకు సంబంధించి బ్రోకర్లును నమ్మి మోస పోవద్దని డిసిపి కోరారు.

## బంగారు దుకాణంలో బెదిరింపులకు పాల్పడిన ఇద్దరిపై కేసు

**జూబ్లీహిల్స్, జూన్ 25, ప్రభాతవార్త:** బంజారాహిల్స్‌లోని ఓ జ్యువెలరీ షాపులోకి వెళ్లి డబ్బులు డిమాండ్ చేస్తూ సిబ్బందిని బెదిరించిన ఇద్దరిపై బంజారాహిల్స్ పోలీసులు కేసు నమోదు చేశారు. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజా రాహిల్స్ రోడ్ నంబర్10లోని శ్రీ సాయి జగదాంబా పెర్ల్స్ అండ్ జ్యువెలర్స్‌లోకి అలీమ్, యూనస్ అనే ఇద్దరు వ్యక్తులు మద్యం మత్తులో వచ్చారు. షాపులోని సిబ్బందిని వేధిస్తూ బెదిరించారు. షాపు యజమాని దిగంబర్ టాక్లే అక్కడ లేకపో వడంతో అతడిని ఫోన్ చేసి పిలవాలని డిమాండ్ చేసిన నింది తులు, రూ.2 లక్షలు ఇవ్వాలని ఒత్తిడి సిబ్బందిని ఒత్తిడి చేశా రు. తమ వద్ద కత్తి ఉందంటూ భయపెట్టారు. గతంలో కూడా షాపు ప్రారంభానికి ముందు అలీమ్ వచ్చి డబ్బులు అడిగినట్లు షాపు మేనేజర్ పంకజ్ ఫిర్యాదులో పేర్కొన్నారు. ఫిర్యాదు ఆధారంగా పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## సాయిబాబా వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే నవీన్ యాదవ్

**యూసుఫ్‌గూడ, 25 జూన్, ప్రభాతవార్త :**
ప్రజలందరూ సేవాభావం ఐక్యమత్యంతో ముందుకు సాగాలని శ్రీ షిరిడీ సాయిబాబా బోధనలు అందరికీ ఆదర్శప్రాయమని జూబ్లీహిల్స్ శాసనసభ్యులు వి.నవీన్ యాదవ్ అన్నారు. గురువారం కళ్యాణ్‌నగర్ వెంచర్3 లోని శ్రీ షిరిడీసాయిబాబా 27వ వార్షికోత్సవ వేడుకల్లో ఆయన పాల్గొని బాబాకు ప్రత్యేక పూజలు నిర్వహించా రు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను శాలువతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు మానిక్ పవర్ బాబా, కళ్యాణ్‌నగర్ సంక్షేమ సంఘం అధ్యక్షులు నాగళ్ల నరసింహారావు మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## దాడి చేసి నిర్బంధించారంటూ ఫిర్యాదు

**జూబ్లీహిల్స్, జూన్ 25, ప్రభాతవార్త:**
భూవ్యవహారంలో మోసం చేసి బెదిరింపులకు, దాడులకు, అక్రమనిర్బంధానికి పాల్పడ్డారంటూ ఒక ప్రభుత్వ గుత్తేదారు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఆరుగురిపై జూబ్లీహిల్స్ ఠాణాలో కే సు నమోదైంది. జూబ్లీహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. సో మాజీగూడలో నివసించే ప్రభుత్వ గుత్తేదారు గడ్డి చంద్రశేఖర్ స్నేహితుడైన కేఈ ప్రసాద్‌రావు ద్వారా 2022లో మాజీ మంత్రిగా పరిచయం చేసుకున్న కె. నాగేశ్వరరావును కలిశారు. ఈ క్రమంలోనే ఖాజాగూడ, కోకాపేట్ ప్రాంతాల్లోని భూము లకు సంబంధించిన ధరణి రికార్డుల నవీకరణ పనులను చంద్రశేఖర్‌కు అప్పగించారు. ఆ భూములకు సంబంధించి పలువురు హక్కుదారులు ఉన్నట్లు, పత్రాలపై వివాదాలు ఉన్న ట్లు విచారణలో తేలడంతో చంద్రశేఖర్ ఆ పనుల నుంచి తప్పుకున్నారు. దీంతో అతనిపై ఒత్తిడి పెంచి, 2025 ఫిబ్రవరి 21 నుంచి నాగేశ్వర్‌రావు కుమారుడైన సునీల్ కుమార్ యాద వ్ తరచూ ఫోన్ చేసి బెదిరింపులకు పాల్పడటం ప్రారంభిం చాడు. ఫిబ్రవరి 27న పార్క్ హయత్ హోటల్ సమీపంలోని జాస్పర్ కార్యాలయానికి తీసుకెళ్లి, అక్కడ కొందరు వ్యక్తులు తనను చుట్టుముట్టి దాడి చేసి, ఖాళీ స్టాంప్ పేపర్లు, ప్రామిస రీ నోట్లు, రెండు సంతకం చేసిన చెక్కులను బలవంతంగా తీసుకున్నారని చంద్రశేఖర్ ఫిర్యాదులో పేర్కొన్నారు. తన పాన్ కార్డు వివరాలను సేకరించారని, తన వద్ద నుంచి కొన్ని పత్రాలను స్వాధీనం చేసుకున్నారన్నారు.



## ఇందిరమ్మ గృహాలతో పేదల జీవితాల్లో వెలుగులు

**జవహర్ నగర్,జూన్ 25, ప్రభాత వార్త:** రాష్ట్రంలోని పేదల అభ్యున్నతే తెలంగాణ ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ఇందిరమ్మ కలల సంక్షేమ రాజ్య స్థాపనే ప్రభుత్వ ఆశయమని మేడ్చల్‌మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ పార్టీ అధికార ప్రతినిధి మల్లెపూల శ్రీకాంత్ యాదవ్ పేర్కొన్నారు.తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజాపాలన ప్రగతి కార్యక్రమంలో భాగంగా మల్కాజిగిరి మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కీసర సర్కిల్ జవహర్‌నగర్ పాత గబ్బిలాల పేటలో ఇందిరమ్మ గృహ నిర్మాణ పథకం కింద లబ్ధిదారులు సాట్ల కోమల, బిక్షపతిలకు మంజూరైన నూతన గృహాల గృహప్రవేశ కార్యక్రమం గురువారం నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ బల్లి రోజా శ్రీనివాస్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి శ్రీకాంత్ యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై గృహప్రవేశ శుభకార్యక్రమంలో పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల ప్రభుత్వమని, అర్హులైన ప్రతి కుటుంబానికి సంక్షేమ పథకాల ఫలాలు అందేలా కృషి చేస్తున్నామని తెలిపారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నాయకత్వంలో పేదల అభ్యున్నతే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని పేర్కొన్నారు. ఇందిరమ్మ ఆశయాలకు అనుగుణంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల ద్వారా తెలంగాణ రాష్ట్రం దేశానికే ఆదర్శంగా నిలుస్తోందన్నారు. ప్రతి పేదవానికి కూడు, గూడు, నీడ, వైద్యం అందాలనే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతోందని, పేదరిక నిర్మూలన కోసం అందరూ కలిసికట్టుగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఇందిరమ్మ కలలుగన్న సంక్షేమ సమాజ నిర్మాణానికి ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని సూచించారు.అనంతరం ఇందిరా మహిళా శక్తి పథకం ద్వారా మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు, జవహర్‌నగర్ ప్రాంత మహిళలకు మీ రేవంతన్న కానుక కార్యక్రమం ద్వారా లబ్ధి చేకూర్చారు.ఈ కార్యక్రమంలో జవహర్‌నగర్ మాజీ మేయర్ శాంతి కోటేష్ గౌడ్, మాజీ సర్పంచ్ శంకర్ గౌడ్, కాంగ్రెస్ నాయకులు కల్లేపల్లి సదానంద్, కోటేష్ గౌడ్, యువ నాయకులు మాట్ల వినయ్, మాజీ కార్పొరేటర్లు బల్లి శ్రీనివాస్ గుప్తా, కుతాడి సాయి, సీనియర్ నాయకులు ఎర్రగుడ్ల వెంకటేశ్వర్లు, నంగునూరి అశోక్ గుప్తా, గజ్వేల్ శంకర్ తదితరులు పాల్గొన్నారు.

## నూతన కార్యవర్గం సమావేశం

**చేవెళ్ల, జూన్ 25, ప్రభాతవార్త :** చేవెళ్ల భారతీయ జనతా పార్టీ నూతన కార్యవర్గం సమావేశం మున్సిపల్ అధ్యక్షుడు అత్తెల్లి అనంత్ రెడ్డి అధ్యక్షతన జరిగింది. 28న జరిగే రంగారెడ్డి జిల్లా నూతన కార్యాలయం ప్రారంభానికి విచ్చేస్తున్న జాతీయ పార్టీ అధ్యక్షులు నితిన్ నబీన్ ఘన స్వాగతం పలకాలని కోరడం జరిగింది అదేవిధంగా నూతనంగా ఎన్నుకోబడిన మున్సిపల్ కమిటీ సభ్యులను సన్మానించడం జరిగింది. నూతన కమిటీ సభ్యులు ప్రధాన కార్యదర్శులు పత్తి సత్యనారాయణ, చేగురి ప్రవీణ్ రెడ్డి, ఉపాధ్యక్షులు పెద్దోళ్ల దయాకర్ , పిసరి శ్రీకాంత్ రెడ్డి, కాసుల నాగరాజ్ గౌడ్, జి శివకుమార్ గౌడ్, కార్యదర్శులు గాజులగూడెం శ్రీనివాస్ రెడ్డి ,ఎర్ర గోవర్ధన్ వద్దే అమృత శ్రీకాంత్ గౌడ్ కార్యవర్గ సభ్యులు నగేష్ ,సమ కృష్ణ రెడ్డి, చాకలి శ్రీనివాస, రవి , కరుణాకర్, రమేష్ గౌడ్, పి సంజీవ్ రెడ్డి శేరి విజయలక్ష్మి మ్మ కె చంద్రశేఖర్ రెడ్డి, చంద్రయ్య, అదేవిధంగా ఏ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు ఆంజనేయులు గౌడ్ మాణిక్యారెడ్డి శర్వలింగం ఇంద్రసేన రెడ్డి అశోక్ చంద్రశేఖర్ రెడ్డి కలెంల మహేందర్ కృష్ణ రెడ్డి అభిశేఖర్ రెడ్డి పురుషోతం రెడ్డి రవి సురేందర్ రెడ్డి రామకృష్ణ నరేష్ గణేశ్ జయసింహ రెడ్డి జగదీశ్వర్ రెడ్డి, పాల్గొన్నారు.

## అక్రమంగా తరలిస్తున్న గోవుల పట్టివేత

**ఘట్‌కేసర్, జూన్ 25, ప్రభాతవార్త:** అక్రమంగా తరలిస్తున్న 15 గోవుల దూడలను ఘట్‌కేసర్ పోలీసులు పట్టుకొని ఇద్దరిని అరెస్ట్ చేశారు. యంనంపేట్ చౌరస్తాలో వాహనాలను పోలీసులు తనిఖీ చేశారు. వరంగల్ నుంచి హైదరాబాద్ వైపుకు వెళ్తున్న అశోక్‌లేలాండ్ గూడ్స్ (ఎంపీ39డబ్ల్యుపి–9110) వాహనాన్ని ఆపి చూడగా అందులో 15 గోవుల దూడలు ( 13 మగ, 2 ఆడ దూడలు) ఉండటంతో వాటిని తరలిస్తున్న ఇద్దరిని అదుపులోకి తీసుకొని విచారించారు. వాహనంలో ఏలాంటి గాలి, నీరు, సదుపాయం లేకుండా అత్యంత క్రూరంగా తాడుతో కట్టి ప్లాస్టిక్ తార్పాలిన్ కప్పి దూడలను బహుదూర్‌పురలోని జంతువధశాలకు తరలిస్తున్నట్లు గుర్తించారు. కాకినాడకు చెందిన వాహనం డ్రైవర్ శ్రీనివాస్‌రావు, హెల్పర్ కాశీబాబులను అరెస్ట్ చేసి వాహనాన్ని సీజ్ చేసి పోలీస్‌స్టేషన్‌కు రప్పించి దూడలను సురక్షిత ప్రాంతానికి తరలించారు. బహుదూర్‌పురకు చెందిన పశువుల వ్యాపారి ఇసాక్ ఆదేశాల మేరకు దూడలను తుని పశువుల సంతలో కొనుగోలు చేసి బహుదూర్‌పుర కబేళాకు అక్రమంగా తరలిస్తున్నారు.

## ఆటో డ్రైవర్‌ను బెదిరించి దోపిడీ

**- ముగ్గురు నిందితులను అరెస్ట్**

**అత్తాపూర్ ,జూన్ 25,ప్రభాతవార్త :** వట్టేపల్లి నైస్ హోటల్ సమీపంలో ఒక ఆటో డ్రైవర్‌ను కత్తితో బెదిరించి నగదు, మొబైల్ ఫోన్ దోచుకున్న కేసును మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు చాకచక్యంగా ఛేదించారు. ముగ్గురు కరుడుగట్టిన నిందితులను పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుండి చోరీ సొత్తుతో పాటు నేరానికి ఉపయోగించిన ఆయుధాలు, వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అయితే అరెస్ట్ అయిన వారిలో ఎ1, ఎ2 నిందితులు మైలార్‌దేవ్‌పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని రౌడీషీటర్లు కావడం గమనార్హం.ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ వివరాల ప్రకారం.... జూన్ 20న తెల్లవారుజామున గుంతల్ షా బాబా దర్గా సమీపంలో ముగ్గురు నిందితులు మరియు వారి సహచరుడు కలిసి ఒక ఆటో డ్రైవర్‌ను అడ్డుకున్నారు. నిందితులు ఆటో డ్రైవర్‌ను కత్తితో బెదిరించి, భయభ్రాంతులకు గురిచేసి అతని వద్ద నగదును, మొబైల్ ఫోన్‌ను బలవంతంగా లాక్కొని అక్కడి నుండి పరారయ్యారు. బాధితుడి ఫిర్యాదు మేరకు దర్యాప్తు చేపట్టిన మైలార్‌దేవ్‌పల్లి పోలీసులు నిందితులు ఎ1 .మహమ్మద్ మహబూబ్ ఎ2. మహమ్మద్ సద్దాం ఎ3) షేక్ రహీల్ (36)లను అదుపులోకి తీసుకొని వారి నుండి నగదు రూ. 1,600/,నాటు కత్తి మొబైల్ ఫోన్స్ 2, హోండా యాక్టివా బైక్‌ను స్వాధీనం చేసుకున్నారు.



## ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణను పరిశీలించిన కలెక్టర్

**కీసర, జూన్ 25,ప్రభాతవార్త :** ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా గురువారం ప్రారంభించిన బిఎల్ఓలు ఇంటింటికి అందిస్తున్న ఎన్యూమరేషన్ పత్రాల పంపిణీ కార్యక్రమాన్ని కీసర సర్కిల్ పరిధిలోని తిమ్మాయిపల్లి గ్రామంలో జిల్లా కలెక్టర్ మను చౌదరి ప్రత్యేకంగా పరిశీలించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మీకు ఎన్ని ఎన్‌రోల్‌మెంట్ పత్రాలు ఇచ్చారని,ఒక్కొక్కరికి ఎన్ని ఎన్‌రోల్‌మెంట్ పత్రాలు ఇస్తున్నారని,ఎన్‌రోల్‌మెంట్ యాప్ ద్వారా అప్‌లోడ్ చేసే ప్రక్రియను బిఎల్ఓను అడిగి తెలుసుకున్నారు.ఒక్కొక్కరికి రెండు పత్రాలు అందజేస్తున్నామని,సెల్‌ఫోన్‌లో క్యూఆర్ కోడ్ ద్వారా అప్‌లోడ్ చేస్తున్నామని బిఎల్ఓలు వివరించారు.ఈ పర్యటనలో కీసర ఆర్‌డిఓ వెంకట్‌రెడ్డి,తహశీల్దార్ యాదగిరిరెడ్డి,సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నర్కుడ గ్రామంలో ఎస్ఐఆర్‌ను ప్రారంభిస్తున్న సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్,పాలకవర్గ సభ్యులు

## నిజమైన ఓటరుకు న్యాయం జరిగేలా పనిచేయాలి

**శంషాబాద్, జూన్ 25,ప్రభాతవార్త :** అర్హులైన ప్రతి ఓటర్‌కు న్యాయం జరిగేలా బిఎల్ఓలు కృషి చేయాలని నర్కుడ గ్రామ సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ పేర్కొన్నారు.గురువారం శంషాబాద్ మండలం నర్కుడ గ్రామంలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమం (ఎస్ఐఆర్)ను సర్పంచ్ గడ్డం శేఖర్ యాదవ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సర్పంచ్ బిఎల్ఓలకు పలు సూచనలు చేస్తూ, అర్హులైన ప్రతిఒక్కరిని ఓటరుజాబితాలో నమోదు చేయాలని, వివరాల సవరణలు పారదర్శకంగా చేపట్టాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ నీరటి మహేష్, మాజీ ఎంపీటీసీ తొంట గౌతమి అశోక్,వార్డు సభ్యులు చౌట రాజు, పర్వతం వెంకటయ్య, కనకమామిడి విష్ణు, లింగం సంధ్య నవీన్, పర్వతం వినోద్, గూడెపు నీరజలక్ష్మణ్, పులిమామిడి పాలిని శ్రీకాంత్, కర్రె అఖిలగణేష్, నాయకులు టి. కుమార్ గౌడ్, గ్రామస్థులు మరియు ఇతరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రిని పరిశీలించిన సిపిఎం పార్టీ బృందం

**యాచారం,జూన్ 25, ప్రభాతవార్త :** యాచారం మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిని సిపిఎం పార్టీ బృందం గురువారం అకస్మికంగా పర్యటించి పరిశీలించారు. ఈ కార్యక్రమానికి సిపిఎం పార్టీ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ బృందం సభ్యులు హాజరై ఆస్పత్రిని పరిశీలించారు. జాన్వెస్లీ మాట్లాడుతూ.. మండల కేంద్రంలో అన్ని



యాచారం ప్రభుత్వ ఆసుపత్రిలో సిపిఎం పార్టీ బృందం

గ్రామాలకు ప్రజలకు అందుబాటులో ఉన్న ఆసుపత్రిలో అన్ని వసతులు అసౌకర్యంగా ఉన్నాయని అన్నారు.30 పడకల ఆసుపత్రిని గతంలో మంచి సౌకర్యాలు ఉండి అన్ని రకాల వైద్య సౌక ర్యాలు అందుబాటులో ఉండేవి కానీ క్రమక్రమంగా వైద్య సౌకర్యాలు తగ్గుతూ వస్తున్నాయని అన్నారు. 2021 సంవత్సరంలో టిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో ఆస్పత్రి అభివృద్ధి కోసం ఒక కోటి 50 లక్ష నిధులు మంజూరు చేసిన నిధులు సక్రమంగా హాస్పిటల్ సౌకర్యాల కోసం నిధులు ఉపయోగించకుండా అధికారులు పక్కదారి పట్టించారని నిధులు సరైన పద్ధతులు ఉపయోగించడంలో అధికారులు పూర్తి నిరక్ష్య వహించారని ఆరోపించారు. తాత్కాలికంగా ఆస్పత్రి అభివృద్ధి కోసం 50 లక్షలు రూపాయలు దుబారా ఖర్చులు చేశారని, వెంటనే జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని 50 లక్షల నిధులకు సంబంధించిన విచారణ చేయాలని డిమాండ్ చేశారు. నాసిరకమైన కలర్ వేయడం జరిగిందని అదేవిధంగా రోగులకు సంఖ్యకు అనుగుణంగా బెర్తులు లేవని అన్నారు. వైద్యులు సరైన సమయానికి రాకుండా వారు ఇష్టం వచ్చినట్టు వచ్చి వెళ్తున్నారని రాత్రిపూట అసలు ఒక్క డాక్టర్ కూడా ఉండని పరిస్థితి ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. అదేవిధంగా 24 గంటలు వైద్యులు అందుబాటులో ఉండాలని ఖాళీగా ఉన్న సూపరింటెండెంట్ ఎఎన్ఎం ల్యాబ్ టెక్నీషియన్ పోస్టులు వెంటనే భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. అదేవిధంగా శానిటైజర్ సిబ్బందికి కనీస వేతనం 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆసుపత్రిలో కనీసం త్రాగడానికి మంచినీరు సౌకర్యం లేదని అన్నారు. మూత్రశాలలు మరుగుదొడ్లు లేక ఇబ్బందులకు గురవుతున్నారని తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వైద్య శాఖ మంత్రి ఈ హాస్పిటల్ ని సందర్శించి వెంటనే అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని కోరారు. అండర్ డ్రైనేజ్ సమస్య తోపాటు ఆసుపత్రి చుట్టూ ప్రహరీ గోడ నిర్మించాలని దానికి కావాల్సిన నిధులు వెంటనే మంజూరు చేయాలని అన్నారు లేని పక్షంలో సిపిఎం పార్టీ ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ వైద్య రంగంలో ఉన్నటువంటి సమస్యల పైన ఆందోళన చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ రంగారెడ్డి జిల్లా కార్యదర్శి పగడాల యాదయ్య, కార్యవర్గ సభ్యులు బోడ సామిల్, దుబ్బాక రామచందర్, డి జగదీష్ కందుకూరి, జగన్ యాచారం మండల కార్యదర్శి ఆలంపల్లి నరసింహ, జిల్లా కమిటీ సభ్యులు పి అంజయ్య, మండల కార్యవర్గ సభ్యులు అలంపల్లి జంగయ్య, ఎస్ చందు నాయక్, మండల కమిటీ సభ్యులు పి వెంకటయ్య, ఉడుతల జంగయ్య, మండల బాల్రాజ్ ,కావాలి జగన్, డి పెద్దయ్య, కే తావ నాయక్, విప్లవ కుమార్, పలు గ్రామాల పార్టీ శాఖ కార్యదర్శి లు పార్టీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండండి



మాదకద్రవ్యాల నివారణపై విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహిస్తున్న ఇన్స్పెక్టర్ నర్సయ్య

**కొత్తూరు, జూన్ 25, ప్రభాతవార్త:**

యువత భవిష్యత్తును చీకటిలోకి నెట్టేస్తున్న మాదకద్రవ్యాల మహమ్మారిపై కఠిన పోరాటం సాగిస్తున్న కొత్తూరు సిఐ నర్సయ్య మరో సారి తన సామాజిక బాధ్యతను చాటిచెప్పారు. ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ ఆదేశాల మేరకు గురువారం కొత్తూరు పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఫాతిమా స్కూల్, ఐటీఐ కళాశాలలో విద్యార్థుల కోసం భారీ అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సందర్భంగా ఇన్స్పెక్టర్ నర్సయ్య మాట్లాడుతూ, డ్రగ్స్ యువత జీవితాలను నాశనం చేయడమే కాకుండా కుటుంబాలను కూడా ఛిన్నాభిన్నం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులే దేశ భవిష్యత్తు అని, మత్తు పదార్థాలకు దూరంగా ఉంటూ ఉన్నత లక్ష్యాల సాధనకు కృషి చేయాలని సూచించారు. గంజాయి, మాదకద్రవ్యాల వినియోగం వల్ల కలిగే శారీరక, మానసిక, సామాజిక దుష్పరిణామాలను విద్యార్థులకు వివరించారు. డ్రగ్స్ రవాణా, విక్రయం లేదా వినియోగం చేసిన వారిపై ఎన్‌డిపిఎస్ చట్టం 1985 ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నేర చరిత్ర నమోదైతే ఉద్యోగాలు, ఉన్నత విద్య అవకాశాలు కోల్పోయే ప్రమాదం ఉంటుందని తెలిపారు. సీఐ నర్సయ్య ఆధ్వర్యంలో విద్యార్థులు, ఉపాధ్యాయులు, సిబ్బందితో కలిసి "డ్రగ్స్‌కు దూరంగా ఉంటాం.. సమాజాన్ని చైతన్యవంతం చేస్తాం" అనే ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో మాదకద్రవ్యాల నియంత్రణపై అవగాహన కరపత్రాలు పంపిణీ చేశారు.మాదకద్రవ్యాల సరఫరా లేదా వినియోగంపై సమాచారం ఉంటే వెంటనే పోలీసులకు లేదా డీఅడిక్షన్ హెల్ప్‌లైన్ 14446కు సమాచారం అందించాలని సిఐ నర్సయ్య ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

## పింఛన్‌దారులకు అల్పాహారం అందజేత

**కొడంగల్ రూరల్, జూన్ 25 (ప్రభాత వార్త):** కొడంగల్ మున్సిపల్ రెండో వార్డు కౌన్సిలర్ వాణిశ్రీ మధుసూదన్‌యాదవ్ గురువారం స్థానిక పోస్టాఫిస్ వద్ద పింఛన్‌దారులకు అల్పాహారం, తాగునీరు అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోస్టాఫీస్‌కు పింఛన్ కోసం వచ్చే దివ్యాంగులు, వృద్ధులు, వితంతువులకు తన వంతుగా అల్పాహారం, తాగునీరు అందించడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ హెచ్‌ఎం శీలాదేవి, రాహుల్‌యాదవ్, పరమేష్, బలరాం, శ్రీను, రాములు, శివారెడ్డి, జస్వంత్, విగ్నేష్, సత్యప్ప తదితరులు పాల్గొన్నారు.

# కాలనీలలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తా

**కీసర, జూన్25,ప్రభాతవార్త:**

కాలనీలలో నెలకొన్న సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తానని మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు.గురువారం ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం,రాంపల్లి ఆల్ కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రాంపల్లిదాయర మాజీ సర్పంచ్ కందాడి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని కలిసి కాలనీలలో వివిధ పెండింగ్ ప్రజా సమస్యలపై వినతి పత్రం అందజేసి చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాగారం, రాంపల్లికి సంబందించిన పెండింగ్ సమస్యలను సంబంధించి వివిధ శాఖల దృష్టికి తీసుకెళ్లి వాటిని వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. సమస్యలు పరిష్కారమయ్యే వరకు అసోసియేషన్ వాటిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని కోరారు.

మెరుగైన అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆల్ కాలనీల అధ్యక్షులు వేణుగోపాల్,వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్‌గౌడ్,ఉపాధ్యక్షులు దేవి వరప్రసాద్‌రావు, ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రాజు,కోశాధికారి రాంరెడ్డి,ఆర్గనైసింగ్ సెక్రటరీ భాస్కర్,కమిటీ సభ్యులు రామక్రిష్ణ,శ్రీనివాస్,హనుమంతరావు,రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.



కాలనీలలో సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే మల్లారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న ఆల్ కాలనీల సభ్యులు

## అక్రమణకు గురైన నాళాను పరిశీలించిన హైడ్రా అధికారులు

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 25, ప్రభాత వార్త:**

పోచారం డివిజన్ 8 పరిధిలోని జోడిమెట్ల చౌరస్తా వద్ద మేధా కంపెనీ ఎదురుగా గల నాళాను గురువారం హైడ్రా అధికారులు, మాజీ మున్సిపల్ చైర్మన్ బోయపల్లి కొండల్‌రెడ్డితో కలిసి పరిశీలించారు.

ఇటీవల హైడ్రా అధికారులకు మాజీ మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి నాళాలను అక్రమించి అక్రమంగా నిర్మాణాలు జరుతున్నాయని ఫిర్యాదు చేశారు.

ఫిర్యాదుపై స్పందించిన హైడ్రా అధికారులు డీఎస్పీ మోహన్‌రావు ఆధ్వర్యంలో జోడిమెట్ల వద్ద నాళాలను అక్రమించి చేపట్టిన నిర్మాణాలను పరిశీలించారు.

ఈ సందర్భంగా డీఎస్పీ మాట్లాడుతూ నాళాలను కబ్జా చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

ఈ కార్యక్రమంలో హైడ్రా డీఎస్పీ మోహన్‌రావుతో పాటు మున్సిపల్ ఏఈ విశేశ్ నాయక్, రాష్ట్ర గిరిజన నాయకుడు జితేందర్ నాయక్ తదితరులున్నారు.



జోడిమెట్ల వద్ద అక్రమణకు గురైన నాళాను పరిశీలించిన హైడ్రా డీఎస్పీ మోహన్‌రావు, మాజీ మున్సిపల్ చైర్మన్ కొండల్ రెడ్డి తదితరులు.

## పోలీస్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేసిన డిఎస్పి

**దుద్యాల్, జూన్ 25, ప్రభాతవార్త:** దుద్యాల్ పోలీస్ స్టేషన్ ను డీఎస్పీ శ్రీనివాస్ అకాస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులు, రిజిస్టర్లు పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు. స్టేషన్‌కు వచ్చే ఫిర్యాదుదారుల వివరాలు, నమోదైన కేసుల పురోగతిపై ఆరా తీశారు. పెండింగ్‌లో ఉన్న కేసుల పురోగతి, రికార్డుల నిర్వహణపై ప్రత్యేకంగా సమీక్షించారు. సాంకేతికతను సద్వినియోగం చేసుకొని నేరాల నియంత్రణకు కృషి చేయాలన్నారు. మాదక ద్రవ్యాల నిర్మూలన, సైబర్ మోసాల పట్ల ప్రజలకు విస్తృతంగా అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో సిఐ శ్రీధర్ రెడ్డి, ఎస్సై శ్రీశైలం పోలీసు సిబ్బంది ఉన్నారు.



పోలీసు సిబ్బందికి సూచనలు చేస్తున్న డిఎస్పి శ్రీనివాస్, సిఐ శ్రీధర్ రెడ్డి..

# కాలనీలలో సమస్యలను పరిష్కరిస్తా

**కీసర, జూన్25,ప్రభాతవార్త:**కాలనీలలో నెలకొన్న సమస్యలను దశల వారిగా పరిష్కరిస్తానని మేడ్చల్ నియోజకవర్గ ఎమ్మెల్యే చామకూర మల్లారెడ్డి అన్నారు.గురువారం ఘట్‌కేసర్ సర్కిల్ పరిధిలోని నాగారం,రాంపల్లి ఆల్ కాలనీల వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రాంపల్లిదాయర మాజీ సర్పంచ్ కందాడి శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఎమ్మెల్యేని కలిసి కాలనీలలో వివిద పెండింగ్ ప్రజా సమస్యలపై వినతి పత్రం అందజేసి చర్చించారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నాగారం,రాంపల్లికి సంబందించిన పెండింగ్ సమస్యలను సంబందించి వివిద శాఖల దృష్టికి తీసుకెళ్లి వాటిని వీలైనంత త్వరగా పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.సమస్యలు పరిష్కారమయ్యే వరకు అసోసియేషన్ వాటిపై నిరంతరం పర్యవేక్షణ కొనసాగించాలని కోరారు.మెరుగైన అభివృద్ధి కోసం అందరూ కలిసి పనిచేయాలని సూచించారు.ఈ కార్యక్రమంలో ఆల్ కాలనీల అధ్యక్షులు వేణుగోపాల్,వర్కింగ్ ప్రెసిడెంట్ సాయినాథ్‌గౌడ్,ఉపాధ్యక్షులు దేవి వరప్రసాద్‌రావు,ప్రధాన కార్యదర్శి ప్రవీణ్ రాజు,కోశాధికారి రాంరెడ్డి,ఆర్గనైసింగ్ సెక్రటరీ భాస్కర్,కమిటీ సభ్యులు రామక్రిష్ణ,శ్రీనివాస్,హనుమంతరావు,రాఘవరావు తదితరులు పాల్గొన్నారు.



ఎమ్మెల్యే మల్లారెడ్డికి వినతి పత్రం అందజేస్తున్న కాలనీల సభ్యులు

## అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అందించిన ఘనత కాంగ్రెస్‌దే

**మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మాధవి**

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 25, ప్రభాత వార్త:** కాంగ్రెస్ ప్రభుత్వం అన్నివర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందిస్తుందని పోచారం డివిజన్ కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు ఏర్ర మాధవి అన్నారు. పోచారం డివిజన్ పరిధిలోని నారపల్లిలో గురువారం మహిళలకు ఇందిర మహిళాశక్తి చీరల పంపిణీ కార్యక్రమం జరిగింది. మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు మాధవి అధ్యక్షతన డ్వాక్రా సంఘాల మహిళ సభ్యులకు ఇందిరమ్మ చీరెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తుందని అన్నారు. తెల్లరేషన్ కార్డులు కల్గినవారికి సన్నబియ్యం పంపిణీ, అర్హులకు ఇందిరమ్మ ఇండ్లు, డ్వాక్రా మహిళలకు చీరెలు పంపిణీ, తక్కువ వడ్డీకే రుణాల పంపిణీ వంటి సంక్షేమ పథకాలు అందిస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని అన్నారు. ఈ కార్యక్రమంలో సమభావన సంఘాల నాయకురాలు సోని, లక్ష్మీ, రేణుక, రోజా, మేరీ. రాణి, శ్రీలత తదితరులు పాల్గొన్నారు.



నారపల్లిలో డ్వాక్రా సంఘ సభ్యులకు ఇందిరమ్మ చీరలు పంపిణీ చేస్తున్న పోచారం డివిజన్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఏర్ర మాధవి

## రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం

**కడ్తాల్, జూన్ 25, ప్రభాత వార్త:** రోడ్డు ప్రమాదంలో యువకుడు దుర్మరణం పాలైన సంఘటన రంగారెడ్డి జిల్లా కడ్తాల్ షాద్ నగర్ రహదారి రావిచేడ్ శివారులో బుధవారం రాత్రి చోటుచేసుకుంది. గురువారం కడ్తాల్ సిఐ సైదిరెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. కడ్తాల్ మండలంలోని న్యామతపూర్ గ్రామానికి చెందిన ఉడతల సిద్ధార్థ (21) అనే యువకుడు ద్విచక్ర వాహనంపై రావిచెడు గ్రామానికి వెళ్లి తిరిగి స్వగ్రామానికి వస్తుండగా ఎదురుగా వస్తున్న జెసిబి వాహనం బైక్‌ను ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సిద్ధార్థ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న కడ్తాల్ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. ప్రమాదం ఎలా జరిగిందనే విషయాలపై స్థానికులను అడిగి తెలుసుకున్నారు. మృతుడి తల్లి మున్ని ఇచ్చిన ఫిర్యాదు మేరకు జెసిబి డ్రైవర్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కల్వకుర్తి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ సందర్భంగా సిఐ సైదిరెడ్డి మాట్లాడుతూ వాహనాలు రహదారులపై ప్రయాణించే క్రమంలో తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించాలని అన్నారు.

## ఎస్ఐఆర్ దరఖాస్తులను ప్రతి ఇంటికి అందజేయాలి

**తహశిల్దార్ మునీరొద్దీన్**



ఎస్ఐఆర్ ధరఖాస్తులను పంపిణి చేస్తున్న సర్పంచ్, తహశిల్దార్ తదితరులు.

**మోమిన్‌పేట్, జూన్ 25, ప్రభాతవార్త:** ఎస్ఐఆర్ ఎన్యుమరేషన్ దరఖాస్తులను ప్రతి ఇంటికి అందజేస్తూ వారి సందేహాలకు తగిన సూచనలు తెలియజేయాలని మోమిన్‌పేట్ మండల తహశిల్దార్ మునీరొద్దీన్ బిఎల్ఓలకు సూచించారు. గురువారం మండల పరిధిలోని కోల్కుంద గ్రామంలో స్థానిక సర్పంచ్, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి కరణం కీర్తిరామకృష్ణ సమక్షంలో ఎస్ఐఆర్ దరఖాస్తుల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ప్రతి ఒక్కరికి ఈ ఫారాలు అందజేస్తూ, ఓటర్లు అడిగిన సందేహాలకు వారికి అర్థమయ్యే విధంగా తగిన సూచనలు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహేందర్‌రెడ్డి, ఎంఆర్ఐ గోవర్ధన్, బిఎల్ఓలు సిబ్బంది గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## పీర్లను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

**కొడంగల్,జూన్ 25, ప్రభాతవార్త:** మొహరం వేడుకల్లో భాగంగా కొడంగల్ పట్టణంలో ప్రతిష్టించిన పీర్లను గురువారం మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి దర్శించుకున్నారు.పట్టణంలోని పెద్ద మసీదు పక్కన ప్రతిష్టించిన అల్‌సాబ్ పీర్లకు మాజీఎమ్మెల్యే ప్రత్యేక పూజలు చేశారు.అల్సాబ్ పీర్లకు చాదర్ సమర్పించి కుల మతాల సామరస్యాన్ని ప్రతిబిం బించే ఈ పీర్ల పండుగ అందరూ హిందూ ముస్లీంలు కలిసి మెలిసి చేసుకునే పీర్ల పండుగను కలిసి మెలిసి అనందోత్సవాల మధ్య జరుపుకోవాలని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్,మాజీ వైస్ ఎంపిపి శేరినారాయణరెడ్డి, ఎం.శేఖర్, పరమేష్, రవీంద్రచారి,గౌరీశంకర్,జైన్‌భాయి,ఇర్ఫాన్,రఫిక్ తదితరులు పాల్గొన్నారు.



పీర్లను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్‌రెడ్డి

## కరెంట్ షాక్‌తో కార్మికుడు మృతి

**మేడ్చల్, జూన్ 25, ప్రభాతవార్త :** కరెంట్ షాక్‌తో ఓ కార్మికుడు మృతి చెందిన సంఘటన మేడ్చల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాల ప్రకారం నల్గొండ జిల్లా నారాయణపూర్ మండలం చిల్లాపూర్ గ్రామానికి చెందిన కొర్ర జగ్రామ్(46) నగరంలో నివాసముంటూ విద్యుత్ కాంట్రాక్టర్ వద్ద కార్మికుడిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో గుండ్లపోచంపల్లి డివిజన్ పరిధి కండ్లకోయ శివారులోని సాయి గీతాశ్రమం రోడ్డులో కరెంట్ తీగల కింద ఉన్న చెట్ల కొమ్మలను నరికి తొలగిస్తున్నారు.

కొమ్మలను నరికేస్తున్న సమయంలో పైన ఉన్న కరెంట్ తీగలకు తగలడంతో అతను కరెంట్ షాక్‌కు గురై కింద పడిపోయాడు. అపస్మారక స్థితిలోకి వెళ్ళిపోయిని జగ్రామ్‌కు తోటి కార్మికులు, స్థానికుల సహాయంతో సి పి ఆర్ చేసి, అనంతరం సమీపంలో ఉన్న సిఎంఆర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే అతను మృతి చెందినట్టు నిర్ధారించారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహన్ని అక్కడి నుండి పోలీసులు తరలించేందుకు ప్రయత్నించగా అప్పటికే అక్కడికి చేరుకున్న కుటుంబ సభ్యులు, బంధువులు అడ్డుకున్నారు. విద్యుత్ అధికారుల నిర్లక్ష్యం వల్ల జగ్రామ్ ప్రాణాలు పోయాయని, కరంట్ తీసివేయకుండా పనులు ఎలా చేయిస్తారని నిలదీశారు. అతని కుటుంబానికి న్యాయం జరిగే వరకు మృత దేహన్ని ఇక్కడి నుంచి తరలించేది లేదని ఆందోళనకు దిగారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు మృతుడి బంధువులకు నచ్చజెప్పి అక్కడి నుండి మృతదేహన్ని తరలించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## పిఆర్టియుటిఎస్ సభ్యత్వ నమోదు

**మేడ్చల్, జూన్ 25, ప్రభాతవార్త :** పిఆర్టియుటిఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమాన్ని ఆ యూనియన్ ఆధ్వర్యంలో మేడ్చల్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ శ్రీపాల్ రెడ్డి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి యూనియన్ నిరంతరం పని చేస్తుందని, అతి త్వరలో ప్రభుత్వంతో సమస్యలపై మాట్లాడి వాటిని తీర్చే విధంగా చూస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి ఆనంద్ రెడ్డి, స్టేట్ అసోసియేట్ వెంకట్, మేడ్చల్ మండల్ అధ్యక్షుడు ఆర్ మధుసూదన్ రెడ్డి, ప్రధాన కార్యదర్శి రజిత, పత్రికా సంపాదకుడు పిచ్చిరెడ్డి, పాఠశాల ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయుడు శేఖర్ రెడ్డి, కార్యవర్గ సభ్యులు నరేందర్ గౌడ్, ధనరాజ్, శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, వెంకట్రావు, చక్రధర్, జగదీశ్వర్, తవిటి నాయుడు, విజయలక్ష్మి, హరీష్, చలపతి, స్రవంతి, జ్యోతి, సంజీవ్, రమేష్ నాయుడు, శ్రీనివాస్, రామారావు, నరసింహ రెడ్డి, రవీందర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## యువకుడిపై ఫోక్సోకేసు నమోదు

**బషీరాబాద్,జూన్ 25,ప్రభాతవార్త:** పదిహేనెళ్ల బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన యువకుడిపై బషీరాబాద్ పోలీసులు ఫోక్సో కేసు నమోదు చేశారు.ఎస్ఐ విట్టల్ తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని ఓ గ్రామానికి చెందిన 15ఏళ్ల బాలికను,అదే గ్రామానికి చెందిన సిరిగాని శాణప్ప(23) ప్రేమిస్తున్నానంటూ నమ్మించి ఇంట్లో ఎవరూ లేని సమయంలో అమ్మాయి ఇంట్లోకి వెళ్లి బాలికపై అఘాయిత్యానికి పాల్పడిన విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయటంతో విచారణ జరిపిన పోలీసులు నిందితుడిని అదుపులోకి తీసుకొని కోర్టులో హాజరు పరిచినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.

## ఓటరు సవరణకు సహకరించాలి

**మండల అధ్యక్షులు గోపాల్ నాయక్**

**కుల్కచర్ల,జూన్ 25, ప్రభాతవార్త :** ఓటరు జాబితాల ఖచ్చితత్వం, పారదర్శకత కోసం చేపడుతున్న ప్రత్యేక అధికారులకు సహకరించాలి. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు గోపాల్ నాయక్, సర్పంచ్ మల్లేష్,బండవెల్కిచర్ల సర్పంచ్ మడుగు శ్రీనివాస్, పిరంపల్లి సర్పంచ్ గడ్డం వెంకటయ్య సూచించారు.గురువారం మండల పరిధిలోని పిరంపల్లి, బండవెల్కిచర్ల, ఇప్పాయిపల్లి గ్రామాలలో ఓటరు సవరణకు ప్రారంభించి ఇంటింటికి ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ చేశారు.ప్రజలు తమ కుటుంబ వివరాలను పూర్తిగా, సరైన విధంగా నమోదు చేసి సంబంధిత బిఎల్ఓలకు అందించాలని సూచించారు. ఓటరు జాబితాలో అర్హులైన ప్రతి ఒక్కరి పేరు నమోదు కావడంతో పాటు అనర్హుల పేర్ల తొలగింపునకు ఈ ప్రక్రియ ఎంతో కీలకమని అన్నారు.ఈ కార్యక్రమంలో అయ గ్రామాల పంచాయతీ కార్యదర్శులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## బాధితులకు అండగా కాంగ్రెస్ పార్టీ

**మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కర్రె రాజేశ్**



నారపల్లిలో ఓ ఇంటి విషయమై బాధితులకు అండగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పాల్గొన్న కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు కర్రె రాజేశ్ తదితరులు.

**ఘట్‌కేసర్ రూరల్, జూన్ 25, ప్రభాత వార్త:** పోచారం డివిజన్ నారపల్లిలో మెయిన్ రోడ్డుపై గల నాలుగు ( షేటర్లు ) దుకాణ సముదాయాల యాజమానులైన ఎన్. విజయ, వరలక్ష్మీ, సుందరా చారి కుటుంబ సభ్యులకు అండగా కాంగ్రెస్ పార్టీ ఉంటుందని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కర్రె రాజేశ్ తెలిపారు. కోట్ల రూపాయల విలువైన గల ఆస్తిని కొందరు నకిలీ పత్రాలు చూపించి స్వాధీనం చేసుకోవాలని యత్నిస్తున్నారని బాధితులు తమను శరణు కోరగా తాము వారికి అండగా ఉంటామని కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు రాజేశ్ పేర్కొన్నారు. నారపల్లిలో గురువారం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు రాజేశ్‌తో పాటు ఫీర్జాదీగూడ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తుంగతుర్తి రవి, పోచారం డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సింగిరెడ్డి శ్రీనివాస్ రెడ్డిలు విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడుతూ ఎన్. విజయ, ఎన్. వరలక్ష్మీ, ఎన్. సుందరాచారిలు పరస్పర అంగీకారంతో 2001లో నాలుగు షటర్లు నిర్మించుకుని అప్పటి నుండి అద్దెకు ఇచ్చి గత 25 సంవత్సరాలుగా జీవనోపాధి పొందుతున్నారు. దుకాణ సముదాయాలకు గత 25 సంవత్సరాలుగా ఆస్తిపన్ను సక్రమంగా చెల్లించడంతో పాటు విద్యుత్ బిల్లులు చెల్లిస్తున్నారు. అప్పయ్య అనే వ్యక్తి మరణించిన తర్వాత అతని రెండవ కుమారుడు అయిన గాంధీ బాబు నుండి వీలునామా ఉపయోగించి ప్రస్తుతం ఉన్న నాలుగు షేటర్లను ఖాళీభూమిగా చూపిస్తూ నకిలీ పోటో ఉపయోగించి, రెవెన్యూ అధికారులను మోసపుచ్చి ఎం. అభిషేక్ అనే వ్యక్తి జీపీఏ రిజిస్టర్ చేయించుకున్నట్లు తెలిపారు. బాధితుల పేర్లపై గల షేటర్లను ఖాళీ స్థలంగా చూపిస్తూ పోచారం మున్సిపల్ రికార్డుల్లో ఫోర్జరీ చేసి తన పేరుతో నమోదు చేయాలని ఇంటి నెంబరు కేటాయించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు ఆదేశాల మేరకు మున్సిపల్ అధికారులు విచారణ జరిపి సదరు వ్యక్తి చూపిన స్థలం ఖాళీగా లేదని ఇండ్లు షటర్లు నిర్మించి ఉన్నాయని వారు గత పాతికేళ్లుగా ఆస్తి పన్ను చెల్లిస్తున్నారని నివేదిక కోర్టుకు సమర్పించగా కోర్టు నెంబరు కేటాయింపు దరఖాస్తును తిరస్కరించినట్లు బాధితుల తరపున కాంగ్రెస్ నాయకులు తెలిపారు. అభిషేక్ పేర్కొన్న ప్లాట్లకు ఎలక్ట్రిసిటి కనెక్షన్ కొరకు హబ్సిగూడ విద్యుత్ అధికారులకు దరఖాస్తు చేయగా సైట్ అప్లికేషన్ సరిగ్గా లేదని విద్యుత్ అధికారుల విచారణలో వెల్లడికాగా దరఖాస్తు రిజెక్టు చేసినట్లు తెలిపారు. నాలుగు షటర్ల బాధితులకు చెందినవి కాగా వారికి అండగా కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని కాంగ్రెస్ నాయకులు తెలిపారు. విలేకరుల సమావేశంలో బాధితులతో పాటుగా కాంగ్రెస్ నాయకులు పల్లె బాబురావు, మెట్టు గణేశ్ యాదవ్, ఏర్ర రాజు, మాజీ సర్పంచ్ దేశబత్తిని రాజేశ్, సల్మాన్, దేవాదాయ కమిటీ డైరెక్టర్ శ్యామల అమర్, సహకార బ్యాంకు డైరెక్టర్ ఉదయ్‌కుమార్ రెడ్డి, నరేశ్ గౌడ్ తదితరులున్నారు.

## 28న కెటిఆర్ వికారాబాద్ పర్యటన

**భారీగా తరలిరావాలని పిలుపునిచ్చిన పట్లోళ్ల శ్రీకాంత్ రెడ్డి**

**ధారూర్,జూన్ 25,ప్రభాత వార్త:** ఈనెల 28వ తేదీ ఆదివారం రోజున వికారాబాద్‌లోని నర్సింగ్ గౌలి కార్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించనున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పర్యటనను అత్యంత విజయవంతం చేయాలని ఆ పార్టీ మండల మాజీ అధ్యక్షులు పట్లోళ్ల శ్రీకాంత్ రెడ్డి పిలుపునిచ్చారు. గురువారం మండల కేంద్రంలోని రహీమతుల ఖాన్ సెల్లార్‌లో పార్టీ మండల సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు ముఖ్య కార్యకర్తలతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ బలోపేతం దిశగా



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మండల అధ్యక్షులు శ్రీకాంత్ రెడ్డి

ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా పని చేయాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. కేటీఆర్ పర్యటనను ప్రతిష్టాత్మకంగా తీసుకుని, పార్టీకి చెందిన అనుబంధ సంఘాల మాజీ అధ్యక్షులు, గ్రామ కమిటీల మాజీ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు అందరూ నిర్ణీత సమయానికి హాజరై సభను దిగ్విజయం చేయాలని కోరారు. ప్రతి నాయకుడు, కార్యకర్త సమన్వయంతో పనిచేస్తూ, అధిక సంఖ్యలో తరలివచ్చి ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయడం మనందరి సామాజిక బాధ్యత అని ఆయన స్పష్టం చేశారు.

## ఎస్.ఐ.ఆర్. ఇంటింటి సర్వే ప్రారంభం

**చౌడపూర్ ,జూన్ 25, ప్రభాతవార్త :**

ఎన్నికల సంఘం చేపట్టిన ఎస్.ఐ.ఆర్. ప్రక్రియలో భాగంగా గురువారం నుండి ఇంటింటి గణనను ప్రారంభించి, ప్రతులను పంపిణీ చేశారు.ఇంచార్జ్ ఎంపిఓ శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ, ఎస్.ఐ.ఆర్ ప్రక్రియలో భాగంగా ఎన్యూమరేటర్లు ఇంటింటి సర్వే చేస్తారని , పౌరులు సహకరించాలని కోరారు..జగన్,దామోదర్ రెడ్డి పలువురు పాల్గొన్నారు .



ఎస్ఐఆర్ ప్రక్రియను ప్రారంబిస్తున్న ఇంచార్జ్ ఎంపిఓ శ్రీనివాస్ రెడ్డి

# ఉప్పరిపల్లిలో ఇళ్ల స్థలాల బాధిత లబ్ధిదారుల్లో హర్షం

- హైకోర్టు తీర్పు అనుకూలంగ రావటంతో ఊరట
- కొన్నేళ్ల నుంచి ఉన్న సమస్యకు పరిష్కారం
- అధికారులు అమలు చేయాలని కోరిన వైనం
- ఈ విషయాన్ని వివరించిన శామీర్‌పేట
- ఉమ్మడి మండల మాజీ జడ్పీటిసి పి.బాలేశ్



ఉప్పరిపల్లి ఇళ్ళ స్థలాల బాధిత లబ్దిదారుల్లో హర్షం వ్యక్తం కాగా, పాల్గొన్న శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ జడ్పీటిసి పి.బాలేశ్, తదితరుల దృశ్యం

**శామీర్‌పేట, జూన్ 25, ప్రభాతవార్త:** కొన్నేళ్ల నుంచి సమస్యగా ఉన్న ఉప్పరిపల్లి ఇళ్ల స్థలాల పట్టాలు ఉన్న బాధిత లబ్ధిదారులకు (పిటిషనర్లకు) హైకోర్టు ఊరట నిచ్చింది. ప్లాట్ల విషయంలో చట్ట ప్రకారం తప్ప జోక్యం చేసుకోవద్దని ఆదేశించింది. హైకోర్టు తీర్పు బాధిత లబ్ధిదారులకు అనుకూలంగా రావటంతో ఇళ్ల స్థలాల సమస్య ఇక తీరనుందని ఇళ్లపట్టాల బాధితలబ్దిదారులు హర్షం వ్యక్తంచేశారు. గురువారం శామీర్‌పేట మండలంలోని ఉప్పరిపల్లిలో గ్రామంలో ఇళ్ల పట్టాల లబ్ధిదారులకు హైకోర్టు నుంచి ఊరట కలుగటంతో ఇక సంబంధిత అధికారులు అమలు చేయాలని వారు కోరారు. ఈ సందర్భంగా శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ జడ్పీటిసి పి.బాలేశ్ మాట్లాడుతూ 2003సంవత్సరంలో టిడిపి ప్రభుత్వ హయాంలో ఉప్పరిపల్లిలోని పేదలకు ప్రభుత్వ భూమి సర్వే నెంబర్లు 837,838గల భూమిలో సుమారు 592మంది పేదలకు అప్పటి రాష్ట్రమంత్రి టి.దేవేందర్‌గౌడ్ చేతుల మీదుగా ఉప్పర్‌పల్లిలో పేదలకు ఇళ్లపట్టాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఆ తరువాత కొన్నాళ్లకు ఉప్పరిపల్లిలో పేదలకు ఇళ్ల పట్టాలు పంపిణీ చేసిన స్థలాల నుంచి ఔటర్ రింగురోడ్డు నిర్మాణంలో భూసేకరణ చేశారని, ఓఆర్ఆర్ నిర్మాణం జరిగి దీనిలో సగం మందికి పైగా ఇళ్లపట్టాలు ఉన్నవారికి నష్టం జరిగిందన్నారు. ఆ తరువాత కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో 2014సంవత్సరంలో ఔటర్ రింగురోడ్డులో కొంత మంది ఇళ్లస్థలాలు పోయినందున మళ్లీ ఇళ్లపట్టాలు ఉన్న లబ్దిదారుల జాబితాను పట్టాలు ఉన్న వారి కోసం అందరికి అవకాశం కల్పించటానికి ప్లాన్ సిద్దం చేసి గజాలు తగ్గించి మిగిలిన భూమిలో ఇళ్లపట్టాలు సరిచేసి సుమారు 350మంది వరకు ఇవ్వటం జరిగిందని అన్నారు. అయితే ఇళ్ల స్థలాలకు పట్టాలు ఉండి కొంత మంది పేదలు నిర్మించుకున్న ఇళ్లను 2019సంవత్సరంలో కూల్చివేశారని, ప్లాట్స్ హద్దురాళ్లను కూడ సంబంధిత అధికారులు కూల్చారని అన్నారు. ఈ విషయంపై ఉప్పర్‌పల్లిలో ఇళ్లస్థలాల పట్టాలు పొందిన వారు హైకోర్టును ఆశ్రయించటం జరిగిందన్నారు. బాధిత లబ్దిదారు సకినాల మద్దెమ్మతో కలిసి సుమారు 189మంది బాధిత లబ్దిదారులు హైకోర్టులో రిట్‌పిటిషన్ వేసినట్లు పిటిషనర్లకు కేటాయించిన ప్లాట్లలో నిర్మాణాలు కూల్చివేసే ముందు అదికారులు ఎలాంటి నోటీసులు జారీ చేయలేదని, సరైన విధానాన్ని అనుసరించలేదని హైకోర్టు పేర్కొన్నట్లు తెలిపారు. అయితే దీంతో 2026 ఏప్రిల్ 9వ తేదీన అనుకూలంగ కోర్టు ఉత్తర్వులు వచ్చినట్లు తెలిపారు. ఈ చర్య సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధమని కోర్టు అభిప్రాయపడింది. అయితే హౌస్‌సైట్ పట్టాల షరతులను పిటిషనర్లు ఉల్లంఘించి ఉంటే చట్టంలో నిర్దేశించిన విధానాన్ని పాటిస్తూ చర్యలు తీసుకోవటానికి అధికారులకు అవకాశం ఉందని తెలిపింది. దీంతో రిట్‌పిటిషన్‌ను పరిష్కరిస్తూ సంబంధిత అధికారులకు తగిన ఆదేశాలను జారీ చేసిందన్నారు. ఉప్పరిపల్లిలోని బాధిత నిరుపేదలకు ఇళ్ల స్థలాలను అమలు చేయాలని బాధిత లబ్దిదారులు సంబంధిత అధికారులను కోరారు. అయితే ఉప్పరిపల్లిలో పేదలకు ప్రభుత్వం ఇచ్చిన స్థలాల సమస్యను పలు సార్లు అంతరాయం, ఆటంకాలు జరిగి కొన్నేళ్ల నుంచి ఎదుర్కొంటున్నామని, స్థానికులు శామీర్‌పేట ఉమ్మడి మండల మాజీ జడ్పీటిసి పి.బాలేశ్ ఇళ్ల స్థలాల సమస్యను పరిష్కరించుకోవటానికి సహకారం అందించారని ప్రభుత్వం పేదలకు న్యాయం చేయాలని ఇళ్ల స్థలాలను అమలు చేయాలని వారు కోరారు. దీనిలో ఉప్పరిపల్లి గ్రామానికి చెందిన పలువురు గ్రామస్థులు, మహిళలు, బాధిత లబ్దిదారులు పాల్గొన్నారు.

# పది లక్షలతో సిసి రోడ్డు నిర్మాణ పనులు



సిసి రోడ్డు పనులు ప్రారంభిస్తున్న మాజీ జడ్పిటిసి,సర్పంచ్,తదితరులు

**కేశంపేట, జూన్ 25, ప్రభాతవార్త :**
కేశంపేట మండల పరిధిలోని పాపిరెడ్డి గూడ గ్రామంలో 10 లక్షల రూపాయలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులు చేపడుతున్నట్లు కేశంపేట మాజీ జడ్పిటిసి తాండ్ర విశాల శ్రావణ్ రెడ్డి తెలిపారు. గురువారం గ్రామ సర్పంచ్ శశిరేఖ యాదయ్య తో కలిసి పనులు ప్రారంభించినట్లు వివరించారు. గ్రామ అభివృద్ధికి ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ ఎంతగానో సహకారం అందిస్తున్నారని ఈ సందర్భంగా తెలిపారు కాంగ్రెస్ ప్రభుత్వం గ్రామీణ ప్రాంత అభివృద్ధికి ప్రత్యేక నిధులు మంజూరు చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రఘు, మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు గుండె రాణి, అబ్బి సుందరయ్య, మాజీ సర్పంచ్ శివయ్య, వార్డు సభ్యులు బాలకృష్ణ, రవి, సురేష్, నందు, రామకృష్ణ, శ్రీను. మరియు తాండ్ర శ్రవణ్ రెడ్డి, కృష్ణారెడ్డి, శంకర్, సత్యం, యాదయ్య, రఘు, బాలరాజ్, నర్సింలు, రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు .

# క్రైస్తవులపై దాడులకు పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలి

**మేడ్చల్, జూన్ 25, ప్రభాతవార్త :** మేడ్చల్ రైల్వే కాలనీ సమీపంలోని ఒలివా బాప్టిస్ట్ చర్చిలో సేవలందిస్తున్న పాస్టర్లు విలియం కేరీ, డేవిడ్ మహేశ్వరం, జాకబ్ తదితరులపై బుధవారం కొందరు మతోన్మాదులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తూ, గురువారం మేడ్చల్ పోలీస్ స్టేషన్‌లో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు ఫిర్యాదు చేశారు. క్రిస్టియన్ అడ్వకేట్ ఫోరంతో పాటు మేడ్చల్ పాస్టర్ ఫెలోషిప్ ఆధ్వర్యంలో పోలీసులకు మరో ఫిర్యాదు అందజేశారు. క్రైస్తవుల ప్రార్థనా స్వేచ్ఛకు భంగం కలిగించే ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, పోలీసులు తగిన రక్షణ చర్యలు చేపట్టాలనిహైకోర్టు అడ్వకేట్ సుధీర్, మేడ్చల్ పాస్టర్ ఫెలోషిప్ అధ్యక్షుడు డేవిడ్ కోరారు.

ఈ కార్యక్రమంలో బిషప్ భాస్కర్ ములకల, రాజేశ్వర్ రావు, కాశీ సతీష్, మృత్యుంజయ రావు, అడ్వకేట్ సుధీర్, జెరుషలేము మత్తయ్య, క్రైస్తవ సంఘాల నాయకులు, పాస్టర్లు పాల్గొన్నారు.

# కళాశాలలో డ్రగ్స్ ,సైబర్ నేరాలపై అవగాహన




**తలకొండపల్లె జూన్ 25,ప్రభాత వార్త:** ఫ్యూచర్ సిటీ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని తలకొండపల్లి పోలీస్ స్టేషన్ ఆధ్వర్యంలో గురువారం నాడు స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాలలో .."డ్రగ్స్ వినియోగం మరియు సైబర్ నేరాలపై అవగాహన సదస్సు".. నిర్వహించడం జరిగింది.

ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తలకొండపల్లి ఇన్స్పెక్టర్ శ్రీ వి. జానకిరామ్ రెడ్డి గారు మాట్లాడుతూ, నేటి యువత డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల బారిన పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. టీనేజ్ వయసులోనే చెడు అలవాట్లకు బానిసై చదువును నిరక్ష ్యం చేస్తున్నారని తెలిపారు. డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలు, ఆరోగ్య సమస్యలు, విదేశీ ట్మ్రి ప్రకారం పడే శిక్షల గురించి విద్యార్థులకు వివరించారు. తల్లిదండ్రుల కలలను నిజం చేయాలంటే చెడు వ్యసనాలకు దూరంగా ఉండాలని పిలుపునిచ్చారు.

అనంతరం సైబర్ నేరాల గురించి మాట్లాడుతూ, ఇంటర్ విద్యార్థులు ఎక్కువగా మొబైల్ ఫోన్లు వాడుతున్నారని, సోషల్ మీడియాలో ఫేక్ ప్రొఫైల్స్, మార్ఫింగ్ ఫోటోలతో బ్లాక్ మెయిల్, ఆన్‌లైన్ గేమ్స్ వ్యసనం, లోన్ యాప్ వేధింపులు, పార్ట్ టైం జాబ్ పేరుతో మోసాలు జరుగుతున్నాయని తెలిపారు. సోషల్ మీడియాలో వ్యక్తిగత ఫోటోలు షేర్ చేయవద్దని సూచించారు.

సైబర్ నేరం జరిగితే వెంటనే 1930టోల్ ఫ్రీ నంబర్‌కు కాల్ చేయాలని లేదా ఫిర్యాదు చేయాలని తెలిపారు. డ్రగ్స్ సంబంధిత సమాచారం ఉంటే డయల్ ..100.. కు లేదా స్థానిక పోలీసులకు తెలియజేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, పోలీస్ సిబ్బంది మరియు సుమారు 70 మంది ఇంటర్ విద్యార్థులు పాల్గొన్నారు.



వాల్ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న సూపరింటెండెంట్ రాజ్ కుమార్ ,తదితరులు

## మాదక ద్రవ్యాలకు యువత దూరంగా ఉండాలి

**పరిగి, జూన్ 25, ప్రభాతవార్త:**
జూన్ 22 నుండి 26 వరకు తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మాదక ద్రవ్యాల నిర్మూలన అవగాహన వారోత్సవాలలో భాగంగా పరిగి సబ్ జైలు లో సూపరింటెండెంట్ రాజ్ కుమార్ ఆధ్వర్యంలో ఖైదీలకు అవగాహన కల్పించారు. "నషా ముక్త భారత్ అభియాన్" వాల్ పోస్టర్ ని ఆవిష్కరించి,యువతకు కీలక సందేశాన్నిచ్చారు. దేశానికి వెన్నెముకగా ఉండే యువత మాదక రవాణా వ్యసనాన్ని అధిగమించి తమ భవిష్యత్తును కాపాడుకోవాలని ఆయన సూచించారు.. ఈ కార్యక్రమంలో లీగల్ ఎయిడ్ న్యాయవాది గౌస్ పాషా, పరిగి ప్రభుత్వ ఆసుపత్రి ఐ. సి. టి.. సి కౌన్సిలర్ శోభన ,జైలు సిబ్బంది హరికృష్ణ, ఫయాజ్, అనిల్ పాల్గొన్నారు.

# ఓటరు సవరణ నమోదుపై ప్రజలకు అవగాహన



అంతాయిపల్లిలో ఓటర్లకు సర్‌పై అవగాహన కల్పిస్తూ నమోదు పత్రాలను అందజేస్తున్న జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి, నాయకులు ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, తదితరుల దృశ్యం

**శామీర్‌పేట, జూన్ 25, ప్రభాతవార్త:**
ఓటరు నమోదు, సవరణపై స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (ఎస్ఐఆర్) కార్యక్రమంపై ప్రజలకు అవగాహన కల్పించటం జరుగుతుందని, ఇంటింటికి వెళ్లి ఓటరు జాబితా సవరణ ప్రక్రియపై కూడ వివరిస్తున్నట్లు మేడ్చల్ జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డి తెలిపారు. గురువారం శామీర్‌పేట డివిజన్ పరిధిలోని దేవరయాంజాల్, అంతాయిపల్లి, వివిధ గ్రామాల్లోనూ ఎస్ఐఆర్ కార్యక్రమం ప్రారంభమైంది. బిఎల్‌ఓలు, బిఎల్‌ఏలు కలిసి ఇంటింటా పర్యటించి ఎస్ఐఆర్‌పై నమోదు, సవరణల పత్రాలను అందజేసి అవగాహన కల్పించారు. ఓటరు జాబితా ప్రక్రియలో ప్రతి ఓటరు అప్రమత్తంగా ఉండాలని నిర్వాహకులు సూచించారు. బిఎల్‌ఓలు అందజేసే పత్రాలను పూర్తి చేసి తిరిగి తప్పనిసరిగా సమర్పించాలని, ఇవ్వకపోతే ఓటరు జాబితాలో పేరు తొలగిపోయే ప్రమాదం ఉంటుందని వారు ప్రజలకు వివరించారు.

ఈ కార్యక్రమంలో జిల్లా ఆర్టీఏ మెంబర్ బి.జైపాల్‌రెడ్డితో పాటు మున్సిపల్ కాంగ్రెస్ నాయకులు ఎస్.వేణుగోపాల్‌రెడ్డి, బి.మధుసూదన్‌రెడ్డి, కత్తి రమేశ్, బిఎల్‌ఏలు హనుమంతరావు, బిఎల్‌ఓలు ఎం.ఆనంద్, సి.వీరమణి, డి.సరస్వతి, కరిమునిషా, జి.జ్యోతి, పలువురు పాల్గొన్నారు. ప్రజలు తమ ఓటు హక్కును పరిరక్షించుకోవటానికి ప్రత్యేక ఓటరు సవరణ కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. బిఎల్‌ఓలు అందించే ఎన్యుమరేషన్ పత్రాలు పూర్తి చేసి తిరిగి సమర్పించాలని నాయకులు సూచించారు.

# గిరిజన రిజర్వేషన్ల స్వర్ణోత్సవాలకు భారీ స్వాగతం



**కడ్తాల్, జూన్ 25, ప్రభాతవార్త :** గిరిజనుల రిజర్వేషన్ల స్వర్ణోత్సవ వేడుకల నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ఇందిరమ్మ ఆశీర్వాద బస్సు యాత్ర గురువారం రంగారెడ్డి జిల్లా కడ్తాల్ , ఆమనగల్ మండల కేంద్రాల్లో ఘనంగా ప్రారంభమైంది. ఈ బస్సు యాత్రలో పలువురు ఎమ్మెల్యేలు పాల్గొని గిరిజన ప్రజలతో మమేకమయ్యారు. కార్యక్రమానికి ఎమ్మెల్యేలు కసిరెడ్డి నారాయణరెడ్డి, వంశీకృష్ణ, శంకర్ నాయక్, రామచందర్ నాయక్, బాలు నాయక్, మురళి నాయక్, రామ్ దాసు తదితరులు హాజరయ్యారు. గిరిజన రిజర్వేషన్లు అమలై 50 ఏళ్లు పూర్తైన సందర్భంగా చేపట్టిన ఈ యాత్రకు స్థానిక గిరిజన ప్రజలు పెద్ద సంఖ్యలో తరలివచ్చి సంబరాలు జరుపుకున్నారు. డప్పు చప్పుళ్లు, కోలాటాలతో యాత్రకు స్వాగతం పలికారు.

బస్సు యాత్ర ద్వారా గిరిజన సంక్షేమ పథకాల అమలు, రిజర్వేషన్ల ప్రయోజనాలపై ప్రజల్లో అవగాహన కల్పించే కార్యక్రమాలపై వివరించారు. గిరిజన రిజర్వేషన్ల స్వర్ణోత్సవాలు రాష్ట్రవ్యాప్తంగా ఉత్సాహంగా జరుగుతున్న తరుణంలో ఈ బస్సు యాత్రకు ప్రజల నుంచి అపూర్వ స్పందన లభించింది. అదే విధంగా మైసిగండి మైసమ్మ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పిసిసి సభ్యుడు శ్రీనివాస్ గౌడ్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహా, మున్సిపల్ చైర్మన్ రాంపాల్ నాయక్, గిరిజన సంఘాల నాయకులు హనుమ నాయక్, బిక్యా నాయక్, బీచ్యా నాయక్, కృష్ణ నాయక్, లక్పతి నాయక్, హీరా సింగ్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటర్ సమగ్ర సవరణను విజయవంతంగా పూర్తి చేసుకుందాం

### తహసిల్దార్ రాజేందర్ రెడ్డి..

**కేశంపేట, జూన్ 25, ప్రభాతవార్త :** భారతీయ ఎన్నికల సంఘం ఆదేశానుసారం ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ ప్రక్రియను విజయవంతంగా ముగిద్దామని తహసిల్దార్ రాజేందర్ రెడ్డి ఓటర్లను కోరారు. గురువారం మండల కేంద్రంలోని ఎమ్మార్వో కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని 29 గ్రామాలలో ప్రత్యేక ఓటర్ జాబితా సమగ్ర సవరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలో 43 మంది బూతులు లెవెల్ అధికారులు ప్రతి ఇంటికి గణన పారంలను అందజేయనున్నట్లు తెలిపారు. ఈ గణన పారంలో ఓటర్ వద్ద ఉన్న వివరాలను సమగ్రంగా నింపి ఇంటికి వచ్చిన అధికారులకు అందజేయాలని సూచించారు. వచ్చేనెల 25వ తేదీ వరకు అందుబాటులో ఉన్న ప్రతి ఒక్కరు ఈ అవకాశాన్ని తప్పనిసరిగా వినియోగించుకోవాలని కోరారు. అందుబాటులో లేని ఓటరు జులై 31వ తేదీ నుండి ఆగస్టు 30వ తేదీ వరకు తమ ఓటు హక్కు పొందడానికి అధికారులు అడిగిన అన్ని వివరాలు సమర్పించి తమ ఓటును పొందవచ్చునని పేర్కొన్నారు. జులై 31వ తేదీ నుండి సెప్టెంబర్ 28వ తేదీ వరకు ఓటర్ సవరణపై ఎవరికైనా అభ్యంతరం ఉంటే సంబంధిత అధికారులను సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఓటర్ సమగ్ర సవరణ తుది జాబితాను అక్టోబర్ ఒకటో తేదీన జాబితాను విడుదల చేయనున్నట్లు తెలిపారు. ఎవరికైనా ఓటర్ సమగ్ర సవరణ సర్వేపై అనుమానాలు ఉంటే అధికారులను సంప్రదించవచ్చని తెలిపారు. ఎన్నికల సంఘం ఆదేశానుసారం నిర్వహిస్తున్న ప్రత్యేక ఓటర్ సమగ్ర సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఓటర్లను కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ చెన్నకేశవులు అధికారులు పాల్గొన్నారు.

## తొమ్మిది రేకుల రైతు వేదికలో విత్తనమేళా కార్యక్రమం

**కేశంపేట, జూన్ 25, ప్రభాతవార్త:**
కేశంపేట మండల పరిధిలోని తొమ్మిది రేకుల గ్రామంలో నిడదవెల్లి, తొమ్మిది రేకుల, లింగంధన ,క్లస్టర్ రైతు వేదికలో స్థానిక సర్పంచ్ బీసా కవితా కరుణాకర్ రెడ్డి ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకున్న విత్తనమేల కార్యక్రమం నిర్వహించారు. ఈ అమ్మ ఈ సందర్భంగా ఏఈఓ తేజ్ కుమార్ ముఖ్యఅతిథిగా పాల్గొని మేలు జాతి విత్తనాలు వాడడం వలన కలిగే ప్రయోజనాలు ఆయిల్ ఫామ్ సాగు చేయడం వలన వచ్చే లాభాల గురించి రైతులకు వివరించారు. ఈ



విత్తనమేళాలో పాల్గొన్న ,అధికారులు ,సర్పంచ్ కవితా కరుణాకర్ రెడ్డి,రైతులు

కార్యక్రమంలో,ఉప సర్పంచ్ రవి నాయక్ ,మాజీ ఉప సర్పంచ్ నరసింహారెడ్డి, వార్డు సభ్యులు పోగుల నర్సింలు ,నరేష్, రైతులు ఆలూరు శ్రీనివాస్ రెడ్డి, సుజీవన్ రెడ్డి వెంకట్ రెడ్డి, లక్ష్మారెడ్డి, మల్లయ్య, నారాయణ రెడ్డి ,గోవర్ధన్ రెడ్డి, రాములు, బాలకృష్ణ ,శీను ,విత్తన డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## రాంపూర్ గ్రామంలో విజయవంతమైన విత్తన మేళా

**తలకొండపల్లి, జూన్ 25, ప్రభాత వార్త:**
రంగారెడ్డి జిల్లా తలకొండపల్లి మండలంలోని రాంపూర్ రైతు వేదికల్లో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో విత్తనమేళాను గురువారం ఏర్పాటు చేశారు. ఈకార్యక్రమానికి గ్రామ సర్పంచ్ నిర్మల శ్రీశైలం యాదవ్ ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం గుర్తించిన వరి వంగడాలతో పాటు ఇతర విత్తనాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎప్పటికప్పుడు పంటల మార్పిడితోనే దిగుబడులు వస్తాయని ఆ దిశగా రైతులు ముందడుగు వేయాలని వివరించారు. ఈ ఎడాది వర్షపాతం తక్కువ ఉన్నందున అరుతడి పంటలు వేయాలని సూచించారు. యూరియా యాప్ ద్వారా అసలైన రైతులకు యూరియా సరైన సమయంలో అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. యూరియా యాఫ్ రద్దు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేసారు. అనంతరం గ్రామంలో ఖ సర్ఖ ను గ్రామ నాయకులతో కలిసి ప్రారంబించారు. ఓటర్లు అందరూ సర్ పై అవగాహన కలిగి ఉండాలని సర్పంచ్ కోరారు. బిఎల్ఓలకు సహకరించి ఓటర్లు తమ వివరాలను నమోదు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ అనిత,సొసైటి ప్రదాన కార్యదర్శి చిల్కం శేఖర్,,అంగన్వాడీ టీచర్ లక్ష్మీదేవి, బి ఎల్ ఓ కృష్ణారెడ్డి, రంగయ్య, రైతులు కృష్ణ రెడ్డి, పెంటయ్య, షర్పోద్దీన్,వెంకట్ రెడ్డి, బాలయ్య, రమేష్,మహేష్,మజీద్,శ్రీనివాసులు, అంజి తదితరులు ఉన్నారు.

# భూ సేకరణపై ప్రజాభిప్రాయ సేకరణ




ఎకరాకు రూ.20లక్షల పరిహారం..తాండూర్ ఆర్డీఓ అనిత

**కొడంగల్,జూన్ 25 ,ప్రభాతవార్త:**
ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన నారాయణపేట,కొడంగల్ ఎత్తిపోతల పథకం భూ సేకరణపై గురువారం అధికారులు ప్రజాభిప్రాయ సేకరణ నిర్వహించారు. ఈ సందర్భంగా మండలంలోని ప్యాలమద్ది, పెద్ద నందిగామ,కొడంగల్ ప్రాంతాల్లో తాండూర్ ఆర్డీఓ అనిత అధ్వర్యంలో గ్రామసభ నిర్వహించి రైతులతో భూ సేకరణ అంశంపై సమావేశం నిర్వహించారు. ప్యాలమద్దిలో 95 మంది రైతులకు సంభందించి 43.37 ఎకరాలు,పెద్దనందిగామలో 75 మంది రైతులకు చెందిన 39.20 ఎకరాలు,కొడంగల్‌లోని 75 మంది రైతులకు సంభందించి 27.20 ఎకరాల భూమిని సేకరిస్తున్నట్లు రైతులకు వివరించారు. నియోజకవర్గం మొత్తంలో 1400 ఎకరాల భూమి సేకరిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం ఎకరానికి రూ.20లక్షలు చోప్పున నష్ట పరిమారం అందిస్తుందని తెలిపారు. నారాయణపేట,కొడంగల్ ఎత్తిపోతల పథకానికి భూమి ఇచ్చేందుకు సిద్దంగానే ఉన్నామని నష్ట పరిహారం మరికొంత పెంచి ఇవ్వాలని రైతులు కోరారు. పూర్తిగా భూమి కోల్పోయే రైతు కుటుంబాల్లో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇచ్చేందుకు ప్రయత్నించాలని కోరారు. అలాగే ఎకరానికి కనీసం రూ.50లక్షల వరకు అందించాలని రైతులు అధికారుల దృష్టికి తీసుకువచ్చారు. దీంతో అధికారులు స్పందించి రైతుల వినతులను ఉన్నతాధికారులకు పంపించి తగు న్యాయం జరిగేలా చూస్తామని తెలిపారు. ఇంకా ఏవైనా సమస్యలు ఉంటే తహశీల్దార్ కార్యాలయంలో లేదా ఆర్డీఓ కార్యాలయంలో తెలియజేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ రాంబాబు,డీఈ కృష్ణమోహన్‌గౌడ్,డీఎస్పీ శ్రీనివాస్,సీఐ శ్రీధర్‌రెడ్డి,ఎస్సై సత్యనారాయణలతో పాటు పెద్దనందిగామ,ప్యాలమద్ది సర్పంచ్‌లు చెన్‌బస్‌కుమార్,యాసరోద్దిన్,నాయకులు సంజీవరెడ్డి,సత్తిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఎస్ఐఆర్ ప్రక్రియకు సహకరించాలి

### పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్

**పరిగి ,జూన్ 25, ప్రభాతవార్త :**
భారత ఎన్నికల సంఘం, తెలంగాణ రాష్ట్ర ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు ఎస్ఐఆర్ సవరణ ప్రక్రియలో భాగంగా ఇంటింటి సర్వేలో పరిగి మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్ పాల్గొన్నారు.. పరిగి పట్టణం , 16 వ వార్డులో ప్రారంభమైన ఇంటింటి సర్వేను రజితవెంకటేష్ పర్యవేక్షించి, ప్రజలు ఎస్.ఐ.ఆర్. ప్రక్రియకు సహకరించాలని కోరారు. బిఎల్‌ఏ,ఎన్యూమరేటర్లు ప్రతి ఇంటిని సందర్శించి సవరణ ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని తెలిపారు..వృద్ధులకు,దివ్యాంగులకు, నిరక్షరాస్యులకు ప్రతి అంశాన్ని వివరించి, పారదర్శకంగా ఎస్ఐఆర్ను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయుబ్ , బిఎల్ఎలు ఎన్యూమారేటర్లు పాల్గొన్నారు.



ఎస్ఐఆర్ ప్రక్రియలో పాల్గొన్న మున్సిపల్ చైర్ పర్సన్ రజిత వెంకటేష్

## మండల కేంద్రంలో పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి



**జిల్లేడు చౌదరి గూడెం, జూన్ 25, ప్రభాతవార్త :** జిల్లేడు చౌదరిగూడ మండల కేంద్రంలోనే నూతన పోలీస్ స్టేషన్ భవనాన్ని ఏర్పాటు చేయాలని కోరుతూ గురువారం జేఏసీ నాయకులు తహసిల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మండలంలోని లాల్పాడు లో నూతన పోలీస్ స్టేషన్ భవనం ఏర్పాటు చేయడం వలన ప్రజలకు తీవ్ర ఇబ్బందులు ఎదురయ్యే అవకాశం ఉందని అన్నారు. నూతన పోలీస్ స్టేషన్ భవన నిర్మాణంను మండల కేంద్రంలోనే నిర్మించాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో ముచ్చ సుధాకర్ రావు, వెంకటేష్, బికం శశిధర్, బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

## నూతన దంపతులకు ఆర్థిక సాయం



వివాహ శుభకార్యంలో 25116,రూపాయల ఆర్థిక సహాయాన్ని అందజేసిన కరణం కీర్తిరామకృష్ణ.

**మోమిన్‌పేట్, జూన్ 25, ప్రభాతవార్త:** గ్రామంలో ఎవరికి ఏలాంటి అవసరమైన ఆర్థిక సహాయం అందజేయడం ఆనవాయితిగా, ఇచ్చిన మాట నిలబెట్టుకుంటున్న ఏకైక కుటుంబం కరణం రామకృష్ణ కుటింబీకులు మాత్రమేనని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. మోమిన్‌పేట్ మండలం కోల్కుంద గ్రామానికి చెందిన కీర్తిరామకృష్ణ...... ప్రస్తుతం ఆ గ్రామనికి ఏకగ్రీవంగా ఎన్నుకోబడిన సర్పంచ్, తెలంగాణ రాష్ట్ర సర్పంచుల సంఘం ప్రధాన కార్యదర్శి కరణం కీర్తిరామకృష్ణ గురువారం కోల్కుంద గ్రామానికి చెందిన మంగలి లక్ష్మి అంజయ్య దంపతుల కుమారుని వివాహ వేడుక సదాశివపేట పట్టణంలోని దుర్గా గార్డెన్‌లో జరిగిన అమర్‌నాథ్ సహస్రల వివాహ శుభకార్యంలో పాల్గొని వారి కుటుంబానికి 25116, రూపాయల నగదు ఆర్థిక సహాయాన్ని అందజేసి ఆశీర్వదించారు. ఈ సంధర్భంగా మంగలి అంజయ్య కుటింభీకులు సర్పంచ్ కరణం కీర్తిరామకృష్ణకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ మహెందర్ రెడ్డి, వార్డు సభ్యులు టప్ప ఖాసీం, గ్రామ పెద్దలు గందె సంగమేశ్వర్, అబ్దుల్, కుటింభీకులు, భంధువులు తదితరులు పాల్గొన్నారు.

## ఈనెల 28 పోలియో చుక్కలను వేయండి

**తలకొండపల్లి, జూన్ 25 , ప్రభాతవార్త:** తలకొండపల్లి మండలంలోని అన్ని గ్రామాల చిన్నారి బాలబాలికలకు ఈనెల 28న ఆదివారం పోలియో చుక్కలు అందజేయాలని తలకొండపల్లి ఎపిడిఒ సీతా రామమ్మ, తాసిల్దార్ రమేష్ కుమార్లు తెలిపారు. గురువారం నాడు మండల కేంద్రంలోని మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని అందరు ఏఎన్ఎంలు ఆశా వర్కర్లకు మండల స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పాల్గొన్న డాక్టర్ స్నేహ, సైదమ్మలు మాట్లాడుతూ మండలంలోని ఐదు సంవత్సరాల లోపు బాలబాలికలు అందరికీ పోలియో చుక్కలు వేయాలన్నారు.

మండలంలోని మొత్తం 47 బూత్ ల ద్వారా 5300 మంది చిన్నారి బాలబాలికలకు. పోలియో చుక్కలు వేయాలన్నారు. పోలియో చుక్కలు వేసుకోవడం వల్ల చిన్నారి పిల్లలకు భవిష్యత్తులో ఆరోగ్యంగా ఉంటారని ఈ విషయాన్ని ప్రజలందరికీ తెలియజేపి ఆశా వర్కర్లు అంగన్వాడీ కార్యకర్తలు ఏఎన్ఎంలు విధిగా పాల్గొని పోలియో చుక్కలు వేయాలన్నాయి సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సీతారామమ్మ తహసిల్దార్ రమేష్ కుమార్ డాక్టర్ స్నేహ సైదమ్మ, తో పాటు ఏఎన్ఎంలు ఆశ వర్కర్ తో పాటు ఏఎన్ఎంలు ఆశ వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.